ఇది ప్రజా సమస్యల... పరిష్కార సారధి

# ప్రభాత జాగృతి

ప్రజా చైతన్య.. రథ సారధి

www.prabhathajagruthi.com

24 Karat ₹ 1,30,910

per kg ₹ 1,84,727

సంపుటి : 00
సంచిక : 96
6.12. 2025
శనివారం





## రిపోర్టర్లు కావలెను

అనతి కాలంలోనే అశేష ప్రజాధరణ పొందిన ప్రభాత జాగృతి దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బ్యూరోలు, స్టాఫర్స్, రిపోర్టర్స్ జిల్లాల వారిగా అనుభవజ్ఞులైన వారు కావలెను.

97051 46268, 95503 99555




## అమెరికా ఆంక్షలు ఉన్నా

# చమురు ఆగదు

### భారత్-రష్యా మధ్య బంధాలు మరింత బలోపేతం

### వ్యాపారం రూ.5.75 లక్షల కోట్లకు చేరిన మైలురాయి

**ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఇరుదేశాలు ఏకతాటిపై నడుస్తాం**

- 2024-25లో రూ.64 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం..
- 2030 నాటికి రూ.100 బిలియన్ లక్ష్యం
- స్వదేశీ కరెన్సీలతో వ్యాపారం 96 శాతం.. డాలర్ ఆధారాలు తగ్గుతున్నాయి
- అణుశక్తి, ఇంధన రంగాల్లో సహకారం పెంచుకుంటాం
- ఉక్రెయిన్ యుద్ధం ఆపేందుకు మోదీ ప్రయత్నాలు స్వాగతం.. పుతిన్ ప్రశంసలు
- రక్షణ, ఆర్థిక ఒప్పందాలపై సంతకాలు.. భారత్‌కు నిరంతర ఇంధన సరఫరా
- బ్రిక్స్ అధ్యక్షత్వం చేపట్టే భారత్‌కు పూర్తోద్యమం.. రష్యా మద్దతు
- పశ్చిమ ఒత్తిడులు లేకుండా భారత్-రష్యా సంబంధాలు బలోపేతం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 5 (ప్రభాత జాగృతి) :** ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌తో కలిసి పోరాడతామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. టెర్రరిజాన్ని పూర్తిగా నాశనం చేయడానికి భారత్‌కు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జరిగిన ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ, పుతిన్‌లు పాల్గొన్నారు. సంయుక్త వీడియో సమావేశంలో పుతిన్ మాట్లాడుతూ, 'మోదీతో నిర్మాణాత్మక చర్చలు జరిగాయి. భారత్ ఆతిథ్యం ఎంతో సంతోషాన్నిచ్చింది. అనేక అంశాల్లో ఇరుదేశాల మధ్య అవగాహన కుదిరింది. విభిన్న అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నాం' అని పేర్కొన్నారు. భారత్-రష్యా మధ్య 2024-25 ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం రూ.64 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.5.75 లక్షల కోట్లు) చేరిందని పుతిన్ తెలిపారు. ఇరుదేశాల మధ్య వాణిజ్యాన్ని మరింత పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆయిల్ సహా అన్ని రంగాల్లో సహకారం అందిస్తామని చెప్పారు. ఉమ్మడి ప్రాజెక్టులు, సాంకేతిక అంశాల్లో పరస్పర సహకారం ➤ మిగతా 2లో..

## భారత్,రష్యాల శాంతిమార్గం

- భారత్ ఎల్లప్పుడూ శాంతిపక్షమే
- ఉక్రెయిన్ సంక్షోభానికి దౌత్యమే పరిష్కారం: మోదీ
- రష్యా-ఉక్రెయిన్ విభేదాలు చర్చల ద్వారానే పరిష్కారం
- ఇరుదేశాల మధ్య నమ్మకమే అతిపెద్ద బలం
- ఇంధన భద్రత, అణుశక్తి, క్రిటికల్ మినరల్స్‌లో సహకారం కొనసాగింపు
- ఆర్థిక సంబంధాలకు 'విజన్ 2030' డాక్యుమెంట్‌పై సంతకాలు
- పుతిన్‌కు రాష్ట్రపతి భవన్‌లో ఘన స్వాగతం
- రాజ్‌ఘాట్‌లో గాంధీజీకి పుతిన్ నివాళి
- ఇండియా-రష్యా బిజినెస్ ఫోరమ్‌లో మోదీ-పుతిన్ పాల్గొననున్నారు

2

## పుతిన్‌కు రాష్ట్రపతి విందు

- కాంగ్రెస్‌కు అందని ఆహ్వానం
- అనూహ్యంగా శశిథరూర్‌కు ఆహ్వానం
- ఆపరేషన్ సిందూర్ బ్రీఫింగ్ బృందంలోనూ థరూర్



## హైదరాబాద్ తరహాలో

# వరంగల్ అభివృద్ధి

### నర్సంపేటపై రూ.532 కోట్ల వరాల జల్లు..

**బీఆర్ఎస్‌పై రేవంత్ ధ్వజమెత్తిన విరుచుకుపడ్డ విమర్శలు**




2

- బీఆర్ఎస్ పదేళ్లలో ఫామ్‌హౌసులు.. విమానాలే తప్ప అభివృద్ధి లేదు
- వరి వేస్తే ఉరి వేసినట్లు అన్న కేసీఆర్‌ను గుర్తుచేసిన సీఎం
- సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్.. రుణమాఫీతో రైతులకు మద్దతు
- 1.10 కోట్ల కొత్త రేషన్ కార్డులు.. 3.10 కోట్ల మందికి సన్నబియ్యం
- ఉచిత కరెంటుకు పేటెంట్ కాంగ్రెస్‌దే.. రైతు భరోసాతో రూ.9 వేల కోట్లు
- హైదరాబాద్‌కు ఏముందో వరంగల్‌కూ అదే.. మార్చి 31లోపు ఎయిర్‌పోర్టు
- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా స్కూల్.. రూ.130 కోట్లతో వైద్యకళాశాల
- 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు.. పేదల ఆత్మగౌరవం పెంచుతున్నాం
- ఉచిత విద్యుత్‌కు పేటెంట్ కాంగ్రెస్ మాత్రమే
- ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం రేవంత్ రెడ్డి



8

## మళ్లీ మన ప్రభుత్వమే వస్తుంది

### పల్లెలకు మంచి రోజులొస్తాయ్: కేసీఆర్ ధీమా!

- ఏకగ్రీవ సర్పంచులతో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో భేటీ
- కష్టకాలం తాత్కాలికమే... అధైర్యపడొద్దు
- స్వయంశక్తితో పల్లెలను అభివృద్ధి చేసుకోండి
- గంగదేవిపల్లి ఆదర్శంగా తీసుకోండి
- ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలు సమృద్ధి సాధిస్తాయ్
- మన పని మనమే చేసుకుంటూ ముందుకు సాగాలి




2

## తగ్గనున్నా హెూమ్‌లోన్, కారు లోన్ ఈఎంఐలు

- ఆర్‌బిఐ మరోమారు కీలక నిర్ణయం
- రెపో రేటు 25 బేసిస్ పాయింట్ల కోత
- రెపో రేటు 5.50% నుంచి 5.25%కి తగ్గింపు
- 2025లో నాలుగోసారి రేట్ కట్.. మొత్తం 125 బిపిఎస్ తగ్గింపు
- ద్రవ్యోల్బణం 2%కే పరిమితం.. వృద్ధి అంచనా 7.3%కి పెంపు
- విదేశీ మారక నిధులు రూ.686 బిలియన్ డాలర్లు
- రూ.1 లక్ష కోట్ల సెక్యూరిటీస్ ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్
- రుణగ్రహీతలకు వెంటనే లబ్ధి.. ఫ్లోటింగ్ రేటు లోన్లు స్వయంచాలకంగా తగ్గనున్నాయి

## పోటీపరీక్షలకు సిద్ధం కండి

- త్వరలోనే ఉద్యోగ నోటిఫికేషన్ ఇస్తాం
- రాజకీయాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు
- నిరుద్యోగులకు సిఎం రేవంత్ కీలక సూచన

2

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలి

- సమ్మిట్ రాష్ట్రాభివృద్ధికి కీలక వేదికగా నిలుస్తుంది
- సీఎం రేవంత్ కృషికి సోనియా అభినందనలు

2

## హిడ్మాను విజయవాడలో పట్టుకెళ్ళి కాల్చారు

- కలప వ్యాపారులే సమాచారం ఇచ్చారు
- దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి మాతోనే ఉన్నారు
- వికల్ప్ పేరుతో మరో లేఖ విడుదల

2



## మా లక్ష్యం.. ప్రతి పేదవాడికి

# ఇందిరమ్మ ఇల్లు

### అర్బన్ ఏరియాల్లో కూడా బహుళ అంతస్థుల నివాసాలు

- అర్బన్ ప్రాంతాల్లో జీ3, జీ4 భవనాలు
- 3.82 లక్షల ఇళ్ల నిర్మాణం జోరుగా
- మార్చి నాటికి 3 లక్షల గృహప్రవేశాలు
- హిల్ట్ పాలసీపై కెటిఆర్‌వి అర్థం లేని విమర్శలు
- గత ప్రభుత్వం హౌసింగ్ శాఖను నిర్వీర్యం చేసింది
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,డిసెంబర్5(ప్రభాత జాగృతి) :** తమ ప్రభుత్వం వచ్చాక పేదలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఇందిరమ్మ ➤ మిగతా 2లో..

" తమ ప్రభుత్వం వచ్చాక పేదలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



## సాయి ఈశ్వర్ మరణానాకి

# ప్రభుత్వానిదే బాధ్యత

- బిసి రిజర్వేషన్లతో మోసం వల్లే అతను ఆత్మహత్య
- అతని కుటుంబానికి 50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావులు డిమాండ్

**హైదరాబాద్, డిసెంబర్ 5 (ప్రభాత జాగృతి) :** సాయిఈశ్వర్ మరణానాకి ప్రభుత్వానిదే బాధ్యతని బిఆర్ఎస్ ఆరోపించింది. బిసి రిజర్వేషన్ల పేరుతో మోసం చేయడం వల్లనే అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడని విమర్శించింది. బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ రెడ్డి చేసిన దారుణమైన మోసానికి సాయి ఈశ్వర్ అనే యువకుడి నిండు ప్రాణం బలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీకి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడవడాన్ని తట్టుకోలేకే ఈశ్వర్ ఆత్మాహుతి చేసుకున్నాడని ➤ మిగతా 2లో..



## రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం

- ఇండిగో సంక్షోభంపై దర్యాప్తునకు ఆదేశం
- సర్వీసుల పునరుద్ధరణకు తక్షణ చర్యలు
- కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు

8

## ఎసిబికి చిక్కిన లంచగొండి అడిషనల్ కలెక్టర్

### 60వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత

- ప్రైవేట్ స్కూల్ రెన్యూవల్ కోసం డిమాండ్ చేసిన ముడుపులు
- డీఈవో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న అడిషనల్ కలెక్టర్
- మరో ఉద్యోగితోపాటు విచారణ కొనసాగుతోంది
- అధికారి ఇంట్లో రూ.100 కోట్ల ఆస్తులు స్వాధీనం
- లంచగొండ్లపై కఠిన చర్యలకు ప్రజల డిమాండ్



2

## హిల్ట్ పాలసీపై హైకోర్టు సీరియస్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు
- 9,292 ఎకరాల భూకేటాయింపుల జీఓకు విరుద్ధంగా హిల్ట్ పాలసీ ఉందని పిటిషన్
- సీబీఐ లేదా ఈడీ దర్యాప్తు.. రికార్డులు సీజ్, ఫోరెన్సిక్ ఆడిట్ కోరిన పిటిషనర్
- వెంటనే కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం
- తదుపరి విచారణ డిసెంబర్ 29కి వాయిదా




2

ఇది ప్రజా సమస్యల... పరిష్కార సారథి
ప్రభాత జాగృతి
ప్రజా చైతన్య.. రథ సారథి



www.prabhathajagruthi.com
Follow :

# ఒక్క అవకాశం ఇవ్వండి
# అభివృద్ధి చేసి చూపిస్తా

- కమాన్‌పూర్‌లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్య లేకుండా చేస్తా
- గ్రామ పరిసరాల పరిశుభ్రతే నా లక్ష్యం
- నిధులుంటే పనులు జరుగుతాయి
- పాలనలో పారదర్శకత లేకుంటే నిధులు మాయమే
- కమాన్పూర్ సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి బోనాల వెంకటస్వామి
- చెత్త డబ్బా గుర్తుకు ఓటెయ్యాలని విజ్ఞప్తి

**తనకు ఒక్క అవకాశం ఇచ్చి గ్రామ సర్పంచిగా గెలిపిస్తే గ్రామాన్ని ఎలా అభివృద్ధి చేయాలో అలా చేసి చూపిస్తానని మండలంలోని కమాన్‌పూర్ పంచాయతీ సర్పంచ్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న బోనాల వెంకటస్వామి తేల్చి చెప్పారు. ఊరిని అన్ని విధాలా అభివృద్ధి చేసి, సమస్యలు లేని గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఊరిని అన్ని విధాలా అభివృద్ధి చేసి, సమస్యలు లేని గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.**

**కమాన్ పూర్, డిసెంబర్ 05 (ప్రభాత జాగృతి) :**

తనకు ఒక్క అవకాశం ఇచ్చి గ్రామ సర్పంచిగా గెలిపిస్తే గ్రామాన్ని ఎలా అభివృద్ధి చేయాలో అలా చేసి చూపిస్తానని మండలంలోని కమాన్‌పూర్ పంచాయతీ సర్పంచ్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న బోనాల వెంకటస్వామి తేల్చి చెప్పారు. ముఖ్యంగా గ్రామంలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. తనకు కేటాయించిన చెత్త డబ్బా గుర్తుకు అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. 'ప్రియమైన గ్రామ పెద్దలారా.. తల్లిదండ్రులారా.. తన్నదమ్ములారా.. అక్కచెల్లెల్లారా.. నా యువ సోదర, సోదరీమణులారా.. మన గ్రామం అంటే మన ఊపిరి.. మన మట్టిమన గౌరవం.. మన నీరుమన జీవనం.. మన పిల్లలే మన రేపటి భవిష్యత్తు.. ఈ రోజు మీ ముందుకు నేను రావడం అనేది పదవి కోసం కాదు.. ప్రచారానికి కాదు.. ప్రశంసల కోసం కాదు.. మీ సహకారం ఉంటే మన ఊరికి నేను ఏం చేయగలననేది మీతో కొన్ని మాటలు పంచుకోడానికి నా తాపత్రయం.. మన గ్రామ అభివృద్ధే నా లక్ష్యం.. మన గ్రామంలో తాగునీరు, మంచి రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు ఏర్పాటు చేస్తా.. కమాన్‌పూర్ గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూస్తా.. గ్రామానికి నిధులు ఉంటే పనులు జరుగుతాయి.. కానీ పాలనలో పారదర్శకత లేకపోతే అవే నిధులు మాయం అవుతాయి.. ప్రతి రూపాయి గ్రామ అభివృద్ధికే ఖర్చు అవ్వాలన్నదే





నా లక్ష్యం' అంటూ ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రతి ఇంటికీ శుద్ధ తాగునీటిని అందిస్తానని, మురుగు కాల్వల సమస్యను పరిష్కరిస్తానని, అన్ని వీధుల్లో నాణ్యమైన సీసీ రోడ్లు వేయిస్తానని వివరిస్తున్నారు. 'మీ కష్టసుఖాల్లో నేను ఎప్పుడూ పాలు పంచుకుంటా.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పారదర్శకమైన పాలన అందిస్తా' అని స్పష్టం చేస్తున్నారు. తనకు కేటాయించిన 'చెత్తడబ్బా' గుర్తుకు ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని, స్వతంత్ర అభ్యర్థినైన తనకు ఒక్క అవకాశం ఇచ్చి ఊరి బాగు కోసం బాటలు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. బోనాల వెంకటస్వామికి ఊరిలో మద్దతు లభిస్తున్నది. ఆయన వెంట మద్దతుదారులు, గ్రామస్తులు ప్రచారంలో పాల్గొంటూ ఇంటింటికీ తిరుగుతూ వెంకటస్వామికి ఓటు వేయాలని కోరుతున్నారు. వెంకట స్వామి గ్రామాభివృద్ధికి సంబంధించిన ప్రణాళికను స్పష్టంగా వివరిస్తుండటంతో గ్రామస్తులు సైతం భరోసా వ్యక్తం చేస్తున్నారు.



## వర్ధవెల్లి దత్తాత్రేయుడికి పొన్నం పూజలు

**రాజన్న సిరిసిల్ల,డిసెంబర్ 05 (ప్రభాత జాగృతి) :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వర్దవెల్లి దత్తాత్రేయ ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. దత్తాత్రేయ స్వామి పాటలను ఆలపిస్తూ భజన కార్యక్రమంలో పాల్గొని తన భక్తి భావాన్ని చాటుకున్నారు. దత్తాత్రేయ స్వామి జయంతిని పురస్కరించుకుని, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బోయినపల్లి మండలం వర్దవెల్లిలో దత్తాత్రేయ ఆలయాన్ని సందర్శించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్తో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. మంత్రి, ప్రభుత్వ విప్ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. దత్తాత్రేయ జయంతి రోజున స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉన్నదని చెప్పారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దత్తాత్రేయ స్వామి పాటలు ఆలపిస్తూ భజన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మీనాక్షి నటరాజన్‌ను కలిసిన శ్రీనివాస్

**కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన సందర్భంగా ఇన్చార్జికి కృతజ్ఞతలు**

**రాజన్న సిరిసిల్ల, ప్రభాత జాగృతి :** రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన సంగీతం శ్రీనివాస్ శుక్రవారం హైదరాబాద్లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించిన ఆమెకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.



## పెద్దపల్లి మున్సిపల్ మహిళా పారిశుద్ధ కార్మికులకు స్వెటర్ల పంపిణీ

**పెద్దపల్లి, డిసెంబర్ 05 (ప్రభాత జాగృతి):**

పెద్దపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 320G జిల్లా గవర్నర్ లయన్ సింహారాజు కోదండ రామ్ అధికారిక పర్యటన సందర్భంగా, మున్సిపల్ మహిళా పారిశుద్ధ కార్మికులకు స్వెటర్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి అధ్యక్షులు లయన్ బోడకుంట రాంకిషన్ ఆర్థిక సహకారంతో రూ.10,000 విలువైన స్వెటర్లు కార్మికులకు అందజేయడం జరిగింది. లయన్ బోడకుంట రాంకిషన్ మాట్లాడుతూ—పట్టణ పరిశుభ్రత కోసం ఎండైనా, వానైనా, చలైనా నిరంతరం ప్రజల4 సేవలో శ్రమించే పారిశుద్ధ కార్మికులకు చిన్న కానుకగా ఈ స్వెటర్లు అందించామని తెలిపారు. జిల్లా గవర్నర్ లయన్ సింహారాజు కోదండ రామ్ మాట్లాడుతూ పెద్దపల్లి లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో జిల్లా స్థాయిలో అగ్రగామిగా నిలుస్తుందని, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో డాక్టర్ల తరువాత పరిశుద్ధ కార్మికుల భూమిక ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు లయన్స్ సేవా స్ఫూర్తిని మరింత బలపరుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డా. రేకులపల్లి విజయ మేడం, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డా. T. వెంకటేశ్వర్ రావు, DCS లయన్ వాసుదేవ రెడ్డి, DCT లయన్ గాలిపల్లి వెంకట్, లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి MJF అధ్యక్షుడు లయన్ బోడకుంట



రాంకిషన్, కార్యదర్శి లయన్ మీసాల సత్యనారాయణ, ట్రెజరర్ లయన్ కళాషికం మహేందర్ రావు, ఐపీపీ లయన్ వేల్పుల రమేశ్, మైక్రో క్యాబినేట్ మెంబర్ లయన్ జి. లక్ష్మయ్య, RC లయన్ రేకులపల్లి శశాంక, సీనియర్ సభ్యులు లయన్ బండ బాబు రావు, లయన్ కావేటి రాజగోపాల్, ఉపాధ్యక్షులు లయన్ జక్కుల సాయిలు, లయన్ కేతిపల్లి మహేందర్ రెడ్డి, లయన్ మట్ట రాంరెడ్డి, లయన్ నిట్టూరి శ్రీనాథ్, లయన్ మామిడాల విజయ భాస్కర్, లయన్ కందుకూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## లింగంపల్లిలో దుమాల ధూంధాం

- ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ ర్యాలీ
- 'ఉంగరం'గుర్తుకు భారీ మెజార్టీ ఇవ్వండి
- గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ
- దుమాలకు మద్దతుగా అబ్బాగోని నరేష్ గౌడ్ ప్రచారం

**వేములవాడ, డిసెంబర్ 05 (ప్రభాత జాగృతి) :**

వేములవాడ గ్రామీణ మండల పరిధిలోని లింగంపల్లి పంచాయతీ ఎన్నికల ప్రచారం శుక్రవారం జోరుగా సాగింది. స్థానిక సంస్థల సమరంలో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన దుమాల నర్సయ్య నిర్వహించిన భారీ ర్యాలీతో గ్రామంలో ఎన్నికల వాతావరణం పతాక స్థాయికి చేరింది. వందలాది మంది కార్యకర్తలు, మద్దతుదారులు, గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్న ర్యాలీ.. గ్రామంలోని ప్రధాన వీధుల్లో నినాదాల మధ్య కోలాహలంగా సాగింది. ఈ సందర్భంగా అబ్బగోని నరేష్ మాట్లాడుతూ దుమాల నర్సయ్య గ్రామాభివృద్ధికి సంబంధించిన ప్రణాళికను స్పష్టంగా వివరించారు. తను కష్టాలు ఓర్చుకొని పైకి వచ్చిన.. గ్రామస్తుల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తి అని, గ్రామ సర్పంచ్గా ఒక్క అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. సర్పంచిగా గెలిపిస్తే గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, సమస్యలు లేని లింగంపల్లిగా తీర్చిదిద్దుతరాని హామీ ఇచ్చారు. ముఖ్యంగా గ్రామంలో దీర్ఘకాలంగా నెలకొన్న



మౌలిక వసతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని నర్సయ్య తెలిపారు. ప్రతి ఇంటికీ 24 గంటల పాటు శుద్ధి చేసిన తాగునీటిని అందిస్తానని, డ్రైనేజీ వ్యవస్థ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని, అన్ని వీధుల్లో నాణ్యమైన సీసీ రోడ్లు నిర్మిస్తానని వివరించారు. 'మీ కష్టసుఖాల్లో నేను ఎప్పుడూ పాలు పంచుకుంటా.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పారదర్శకమైన పాలన అందిస్తా' అని భరోసా ఇచ్చారు. తనకు కేటాయించిన 'ఉంగరం' గుర్తుకు ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచార ర్యాలీలో అబ్బగోని నరేశ్గౌడ్తోపాటు గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పెద్దపల్లి పట్టణంలోనే జిల్లా కోర్టు నిర్మాణం

**రాఘవాపూర్ ప్రతిపాదనకు న్యాయవాదుల వ్యతిరేకం**

**పెద్దపల్లి, డిసెంబర్ 05 : (ప్రభాత జాగృతి)**

పెద్దపల్లి పట్టణ పరిధిలోనే జిల్లా కోర్టును ఏర్పాటు చేయాలని నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఠాకూర్ అజయ్ క్రాంతి సింగ్ నేతృత్వంలోని న్యాయవాదులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోటగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ మాజీ అధ్యక్షుడు లకిడి భాస్కర్‌పై అవిశ్వాస తీర్మాణం పెట్టలేదని, ఆయనను తొలగించలేదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి, సభ్యులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా వ్యక్తిగత ప్రయోజనాలకోసం పనిచేయడంతో ఒక సంవత్సరానికి తాత్కాలిక సస్పెన్షన్ మాత్రమే విధించామని వివరించారు.అసోసియేషన్ నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరించినందువల్లే మెజారిటీ సభ్యులు సమావేశమై భాస్కర్‌ను అధ్యక్ష పదవి నుండి తప్పించామని తెలిపారు. రాఘవాపూర్ వద్ద కోర్టు నిర్మాణం చేపట్టే తీర్మాణంపై బార్ అసోసియేషన్ సభ్యులెవరూ సంతకాలు చెయ్యలేదని, ప్రభుత్వ ప్రతిపాదనను మొదటి నుండి వ్యతిరేకిస్తున్నామని న్యాయవాదులు స్పష్టం చేశారు. అసోసియేషన్‌తో సంబంధం లేని వ్యక్తుల సంతకాలు తీసుకుని తీర్మాణాన్ని అధికారులు వద్దకు సమర్పించడం తప్పుదారి పట్టించే చర్య అని పేర్కొన్నారు.అసత్య ప్రచారాలు కొనసాగితే శాశ్వత బహిష్కరణ తప్పదని శ్రీనివాస్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో ఎక్కడైనా కోర్టు నిర్మాణానికి అభ్యంతరం లేదని, కానీ రాఘవాపూర్‌లో కోర్టు నిర్మాణాన్ని మాత్రం కచ్చితంగా ఎదుర్కుంటామని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో రెడ్డి శంకర్, బొంకూరి శంకర్, ఠాకూర్ కృష్ణ క్రాంతిసింగ్, మామిడిపల్లి శరత్ కుమార్, లవన్ కుమార్, రెడ్డి నర్సింగ్, తాని నరేష్, ఆసరి రమేష్ యాదవ్, ఉద్దెండ నవీన్, పాతర్ల శివ, బోండ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రచారం ఉధృతం చేసిన జంగం ఉమారాణి

**ముద్దాయి పేట్, డిసెంబర్ 05 (ప్రభాత జాగృతి) :**

ముద్దాయిపేట్ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి జంగం ఉమారాణి ప్రచారాన్ని ఉధృతం చేశారు. శుక్రవారం గ్రామంలోని ప్రతి వార్డులో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.. జంగం ఉమారాణి చేపట్టిన ప్రచారానికి అడుగడుగున ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి తనను గ్రామ సర్పంచ్ గా ఎన్నుకోవాలని జంగం ఉమారాణి ఓటర్లను అభ్యర్థించారు... బీఆర్ఎస్ అభ్యర్థి జంగం ఉమారాణి ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుంది. పెద్ద సంఖ్యలో మహిళలు ఆమె వెంట నడిచి ప్రచారంలో జోరు పెంచారు...గ్రామ సర్పంచ్ గా జంగం ఉమారాణి ని గెలిపిస్తామని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.. ఈ ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## పోలింగ్ సిబ్బంది డిసెంబర్ 6న పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకోవాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి, డిసెంబర్ 05 (ప్రభాత జాగృతి):**

పంచాయతీ ఎన్నికల మొదటి విడత పోలింగ్ సిబ్బంది డిసెంబర్ 6న తమ పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.మొదటి విడత పోలింగ్ సిబ్బందికి కేటాయించిన మండలంలో శిక్షణ పూర్తయిన అనంతరం, డిసెంబర్ 6న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, తమ స్వస్థల మండలం (ఓటు హక్కు నమోదైన ప్రాంతం) లోని ఎంపీడీవో కార్యాలయానికి హాజరై పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.పోలింగ్ సిబ్బంది తమ వెంట ఫారం-14, ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ ప్రతులు తప్పనిసరిగా తీసుకురావాలని కలెక్టర్ స్పష్టం చేశారు.మొదటి విడత పోలింగ్ సిబ్బంది డిసెంబర్ 6న పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని, అలాగే ఉన్నతాధికారులు అందించిన అన్ని సూచనలను పాటించాలని ఆయన సూచించారు.

# పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి, డిసెంబర్ 05 (ప్రభాత జాగృతి):**



నిబంధనల ప్రకారం పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని *జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష* సూచించారు. శుక్ర వారం కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్ నందు పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,డిసెంబర్ 6న పిఓ, ఎపిఓ లకు శిక్షణ అందిస్తున్నామని, అదే సమయంలో ఫారం 14 అందించిన ప్రతి ఒక్కరికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించి ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని, పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఓటర్ వివరాలు ఓటరు జాబితాలో మార్క్ చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఆలాట్ చేసిన పోలింగ్ అధికారులందరూ విధులకు హాజరయ్యే విధంగా పర్యవేక్షించాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో అవసరమైన సామాగ్రి పంపిణీ చేసామో లేదో చెక్ చేయాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ముందు పరిశీలించి అవసరమైన ఏర్పాటులో చేసుకోవాలని అన్నారు.

పోలింగ్ నాడు ఉదయమే సిబ్బంది పోలింగ్ స్టేషన్ వద్ద చేరుకునేలా చూడాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్దే స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసి కౌంటింగ్ కు చర్యలు చేపట్టాలని అన్నారు. కౌంటింగ్ ప్రక్రియ నిదానంగా జాగ్రత్తగా చేయాలని తొందర పడాల్సిన అవసరం లేదని అన్నారు. జిల్లాలోని మొదటి విడత పోలింగ్ నందు 4 సర్పంచ్ స్థానాలు, 210 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగిందని, 95 గ్రామ పంచాయతీలు, 670 వార్డు లకు డిసెంబర్ 11న పోలింగ్ నిర్వహించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

పంచాయతీ ఎన్నికలు జరిగిన రోజే ఉపసర్పంచ్ ప్రక్రియ ముగిసే విధంగా చర్యలు తీసుకోవాలని, 50 శాతం కంటే ఎక్కువ వార్డు సభ్యులు అందుబాటులో ఉండేలా ముందస్తుగానే వారికి సమాచారం అందించాలని అన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నరేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమను పెంపొందించుకోవాలి





**నాబార్డ్ సేవలను అభినందిస్తున్న రైతులు**

**జగిత్యాల, డిసెంబర్ 05 (ప్రభాత జాగృతి):**

రైతులు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమను పెంపొందించుకున్నట్లయితే మరింత ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చు అని మామునూరులోని లైవ్ స్టాక్ రీసెర్చ్ స్టేషన్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ వెంకటరమణ తెలిపారు.నాబార్డ్ వారి సహకారంతో జన వికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లాలోని పొన్నం గుట్ట మల్లికార్జున స్వామి రైతు ఉత్పత్తి దారుల సంఘం నుండి 25మంది మహిళా రైతులను లైవ్ స్టాక్ రిసెప్షన్ మామ్నూర్ వరంగల్ జిల్లాకు క్యాట్ ఎక్స్పోజర్ విద్యుత్ కెపాసిటీ బిల్డింగ్ అడాప్షన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ శిక్షణ కార్యక్రమం ద్వారా మామునూరులోని లైవ్ స్టాక్ రీసెర్చ్ స్టేషన్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ ఉంటేనే వారు ఆర్థికంగా అభివృద్ధి చెందగలుగుతారన్నారు.ఈ రోజులలో పాడి పరిశ్రమకు మన తెలంగాణ రాష్ట్రంలో చాలా అవసరం ఉన్నదని,భారతదేశంలో తెలంగాణ పాల ఉత్పత్తిలో ఏడవ స్థానంలో ఉందన్నారు.నాబార్డ్ సహకారంతోనే డెయిరీ ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయడం శుభసూచకమని,ఈ డైరీ ఫ్ పిఓ ద్వారా పాలు,పాల ఆధారిత ఉత్పత్తులు తయారు చేయడం ద్వారా పెరుగు ,నెయ్యి, మజ్జిక వీటితోపాటు బాదం మిల్క్,పాలతో పాలకోవా విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా డైరీ ఫ్ పిఓ కు ఎక్కువ ఆదాయం రావడం జరుగుతుందన్నారు.ముఖ్యంగా పసుపు పోషణలో సూపర్ నేపియర్,కో వెన్కోర్ జింకోన జింగ్రాజ్ ఈ రకాల పశు మేతలో ఇవి మేలు రకాలైన జాతులు వీటి ద్వారా అధిక పాల ఉత్పత్తిని గేదలు ఇవ్వగలుగుతాయన్నారు.గేదెలలో ముర్రే జాతి గేదెలు,జింగ్రాజ్ ఈ గేదెలు రోజుకు 10నుండి 20లీటర్ల పాలను ఇవ్వగలుగుతాయని,వీటి ద్వారా రోజుకు 500నుంచి 1000రూపాయల ఆదాయము డైరీ ఎఫ్ఈఓ రైతులకు రావడం జరుగుతుందన్నారు. దాన విషయంలో కూడా మినరల్ మిక్స్ రేషియో దానాలు వాడాలి దీని ద్వారా పాలలో ఎక్కువగా ఫ్యాట్ శాతం రావడం జరుగుతుందన్నారు.డాక్టర్ నిహాల్ మాట్లాడుతూ డైరీ ఫార్మ్ లో తీసుకోవాల్సిన మెలుకువలు పశుపోషణలో జాగ్రత్తలు వాటికి సంబంధించిన వ్యాధుల గురించి పొదుపు వ్యాప్ కాదు గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యదర్శి పెండ్లి సంపత్ కుమార్,జన వికాస కోఆర్డినేటర్ పెసరి రాజు,బైరి రాజేష్ కన్నా,తోట సోమేశ్వర్,పొన్నగుట్ట ఎపిఓ చైర్మన్ మల్లేశం,బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు బీరయ్య అంజయ్య రాజేశం కొండల్ రెడ్డి వీరితో పాటు 25మంది మహిళా రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో గట్టెపల్లి పాఠశాల విద్యార్థిని ప్రతిభ

**సుల్తానాబాద్, డిసెంబర్ 05 (ప్రభాత జాగృతి):**

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో గట్టెపల్లి జెడ్పి హెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. నవంబర్ 28 నుండి 30 తేదీలలో హైదరాబాద్ లోని మొయినాబాద్ ఫైర్ ఫ్యాక్స్ స్పోర్ట్స్,డిసార్ట్లో జరిగిన 12 వ తెలంగాణ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ఇంటర్ డిస్టిక్ క్రీడల్లో పెద్దపల్లి నుంచి ప్రాతినిధ్యం వహించిన సుల్తానాబాద్ మండలం లోని గట్టెపల్లి జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల విద్యార్థిని ఉమెన్స విభాగంలో 9 వ తరగతి మనహ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ వి అన్నపూర్ణ, ఫిజికల్ డైరెక్టర్ ప్రణయ్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



## అంగన్వాడీల్లో విద్యతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

**శుక్రవారం సభలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్, డిసెంబర్ 05 (ప్రభాత జాగృతి):**



అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య బోధించడంతో పాటు పిల్లల ఆరోగ్యం, పోషణపై అంగన్వాడీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారిస్తారని, అందువల్ల అంగన్వాడిలో పిల్లలను చేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అలుగునూర్ లోని కాకతీయ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన శుక్రవారం సభకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటపాటలతో కూడిన అంగన్వాడీ విద్య పిల్లల భవిష్యత్తుకు ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. అంగన్వాడీల్లో పిల్లల బరువులు, ఎత్తు కొలుస్తూ వారు పరిపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా చూస్తారని అన్నారు. పోషకాహారంతో పాటు ఆలనా పాలన చూసే అంగన్వాడి కేంద్రాలలో పిల్లలను చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానాలు, ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయని, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఈ కేంద్రాల నుంచి ఉచితంగా మందులు స్వీకరించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలు 4 ఏ. ఎన్. సి పరీక్షలు చేయించుకోవాలని, ఎంతో ఖరీదైన టీఫా వంటి స్కానింగ్ సౌకర్యం కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య పరీక్షలు, ప్రసవాలు చేయించుకోవడం ద్వారా డబ్బు ఆదాతో పాటు ఆరోగ్యం బాగుంటుందని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, మెప్మా పీడీ స్వరూపారాణి, సిడిపిఓ శ్రీలత, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సంపత్, డిహెచ్ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ శ్రీలత, సఖి కేంద్రం అడ్మిన్ లక్ష్మి, మెప్మా డీఎంసీ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య కార్మికులకు, విద్యార్థులకు ప్రత్యేక దంత వైద్య క్యాంపులు

- క్యాంపుల నిర్వహణకు ప్రణాళిక రూపొందించాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, డిసెంబర్ 05 (ప్రభాత జాగృతి):**

జిల్లాలోని పారిశుద్ధ్య కార్మికులు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక దంత వైద్య క్యాంపుల ద్వారా ఉచిత వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రభుత్వ దంత వైద్యుల బృందాన్ని ఆదేశించారు. ఇందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి దంత వైద్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లోని పారిశుద్ధ్య కార్మికులు, మల్టీ పర్పస్ వర్కర్లకు ప్రత్యేక క్యాంపు ద్వారా ఉచిత దంత వైద్య పరీక్షలు చేయాలని అన్నారు. కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, మోడల్ స్కూల్, ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులందరికీ దశలవారీగా దంత వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. దంత సమస్యలు ఎక్కువగా ఉన్న వారిని గుర్తించి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తదుపరి చికిత్స అందజేయాలని అన్నారు. ఇందుకోసం ఒక ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. క్యాంపుల నిర్వహణ, చికిత్స కోసం అవసరమైన దంత వైద్య సిబ్బందిని జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల నుండి డిప్యూటేషన్ ద్వారా వినియోగించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ దంత వైద్యులు అందించిన సేవల ప్రగతి నివేదికను జిల్లా కలెక్టర్ కు అందజేశారు. సమావేశంలో ప్రభుత్వ దంత వైద్య అధికారులు రవి ప్రవీణ్ రెడ్డి, రణదీప్, ప్రవీణ్, రాజు, సతీష్ పాల్గొన్నారు.



## బీజేపీలో చేరికలు



**గన్నేరువ, డిసెంబర్ 05 ( ప్రభాత జాగృతి ):** గన్నేరువరం మండలంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ఎత్తున ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి వారందరికీ కాషాయ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో బీఆర్ఎస్ నాయకుడు సందవేణి ప్రశాంత్ యాదవ్, పలువురు కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ , నాయకులు సొల్లు అజయ్ వర్మ, కరివేద మహిపాల్ రెడ్డి, ఏలేటి చంద్రా రెడ్డి, పుల్లెల రాము, పుల్లెల జగన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మ్డ్ ఫ్లాగ్ డే (పతాక దినోత్సవం) సహాయ నిధి సేకరణ ప్రారంభం సందర్భంగా శుక్రవారం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల NCC కేడెట్లు కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని కలిశారు. విరాళాల సేకరణ ప్రారంభించారు. ఈ విరాళాలను వారు ఆర్మీ సహాయ నిధికి పంపించనున్నారు.

- కరీంనగర్, ప్రభాత జాగృతి

## వలస కూలీల పిల్లలను గుర్తించండి

- ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించాలి
- వారి చదువుకు అన్ని విధాలా చర్యలు
- ఇటుక బట్టీల యజమానులు సహకరించాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, డిసెంబర్ 05 (ప్రభాత జాగృతి):**

జిల్లావ్యాప్తంగా వలస కూలీలు, కార్మికుల పిల్లలను గుర్తించి వారిని ప్రత్యేక పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మండల విద్యాధికారులు, ఇటుక బట్టీలు, పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సాధారణంగా వలస కూలీలు ఎక్కువగా పనిచేసే చోటే వర్క్ సైట్ స్కూళ్లు ప్రారంభిస్తారని తెలిపారు. కానీ పిల్లలకు పాఠశాల వాతావరణం ఉండాలనే ఉద్దేశంతో వారి కుటుంబాలకు సమీపంగా ఉన్న పాఠశాలల్లో ప్రత్యేక తరగతిలో బోధిస్తున్నామని అన్నారు. ఇటుక బట్టీలు, పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల పిల్లలను గుర్తించి ఈ బడిలో చేర్పించాలని ఆదేశించారు. వారికి పోషకాహారం, దుస్తులు, పుస్తకాలు అందిస్తామని తెలిపారు. ఇటుక బట్టీల యజమానులు వారి సాయంగా పిల్లలకి రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. గత ఏడాది సుమారు 500 మంది వలస కూలీల పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్పించి విద్య అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఏడాది మరింత శ్రద్ధతో ప్రత్యేక పాఠశాలలపై దృష్టి పెట్టాలని అన్నారు. ప్రత్యేక పాఠశాలల్లో చేరిన వలస కార్మికుల పిల్లలకి ఇంగ్లీషులో బోధించాలని సూచించారు. భవిష్యత్తులో వారికి చదువు పట్ల శ్రద్ధ పెరిగి ఎక్కడికి వెళ్ళినా చదువుకునే ఉత్సాహం ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. బడి బయట ఉన్న పిల్లలను కూడా గుర్తించి బడిలో చేర్పించాలని అన్నారు. ఇప్పటికే 185 మంది పిల్లలను గుర్తించినట్లు విద్యాధికారులు తెలిపారు.

**పదవ తరగతి విద్యార్థులపై దృష్టి పెట్టాలి**

పదవ తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి నూరు శాతం ఫలితాలు వచ్చేలా చూడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మండల విద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో మండల విద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పదవ తరగతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. ప్రత్యేక అధికారులు పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్పెషల్ క్లాస్ లను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ బోర్డు పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. మండల విద్యాధికారులు వారానికి రెండు సార్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలను సందర్శించాలని ఆదేశించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలోని పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో కనీసం 20 మంది పిల్లల నమోదు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనం వండేందుకు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని వాటిని విధిగా ఉపయోగించాలని పేర్కొన్నారు. స్నేహిత ఫిర్యాదుల పెట్టెలను ప్రతి పాఠశాలలో తప్పక నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.



# ఆకట్టుకుంటున్న పర్యావరణహిత నాగలి



**భూపాలపల్లి, డిసెంబర్ 05 ( ప్రభాత జాగృతి):** జడ్పీహెచ్ఎస్ చిట్యాల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి తంగళ్ళపల్లి శ్రీరామ్ ఆరవ తరగతి జూనియర్ సైన్స్ ఫెయిర్ విభాగంలో ఎకో ఫ్రెండ్లీ ప్లఫింగ్ టూల్ ను గైడ్ టీచర్ బిట్ల సరళాదేవి ఆధ్వర్యంలో రూపొందించి వ్యవసాయ రంగంలో రైతులు పర్యావరణహితంగా భూమిని దున్నే పనిలో ఈ టూలుని ఉపయోగించవచ్చని శ్రీరామ్ చెప్పే విధానం పలువురిని ఆకర్షించిందని సైన్స్ ఉపాధ్యాయులు జడ్జిమెంట్ కమిటీ సభ్యులు శ్రీరామ్ మరియు గైడ్ టీచర్ ను అభినందించారు. ఈ ప్రాజెక్టు ముఖ్యంగా చిన్న సన్నకారు రైతులకు కిచెన్ గార్డెన్ లకు తక్కువ ఖర్చుతో మరియు పర్యావరణహితమైన నాగలిగా ఉపయోగపడుతుంది అభినందించిన వారిలో తెలంగాణ సామాజిక రచయితల సంఘం అధ్యక్షుడు కామిడి సతీష్ రెడ్డి, మండల విద్యాధికారి కొడెపాక రఘుపతి చెకుముకి, జిల్లా జనరల్ సెక్రెటరీ వేల్పుల రాజు, సూదం సాంబమూర్తి, కుర్రె ప్రవీణ్ తదితరులు ప్రశంసలు అందించారు.

# ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి ప్రాణాలు కాపాడే వినూత్న యంత్రం




**భూపాలపల్లి, డిసెంబర్ 05 ( ప్రభాత జాగృతి):** భారతదేశం గత కొన్ని దశాబ్దాలుగా తీవ్రవాదం అనే భారీ సవాల్‌ను ఎదుర్కొంటోంది. నేరగాళ్లు, తీవ్రవాదుల నుంచి ఎప్పటికప్పుడు పెరుగుతున్న ముప్పును దృష్టిలో పెట్టుకొని, అలాంటి ప్రమాదాలను ముందుగానే గుర్తించి అరికట్టే దిశగా ఒక వినూత్న ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంది. భూపాలపల్లి జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్ సైన్స్ ప్రదర్శనలో ఈ ప్రాజెక్ట్ విశేషంగా ఆకట్టుకుంది. లేసర్ లైట్, ఎల్‌సీడి డిస్‌ప్లే, బాంబ్-మెటల్ డిటెక్టర్ టెక్నాలజీలను ఉపయోగించి రూపొందించిన ఈ పరికరం, పబ్లిక్ ప్రదేశాల్లో సంభవించే తీవ్రవాద చర్యలను ముందుగానే గుర్తించి అలర్ట్ ఇవ్వగలదు. ప్రధాన కార్యాలయాలు, సినిమాహాళ్లు, కలెక్టర్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు వంటి జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో దీనిని అమర్చితే, అనుమానాస్పద వస్తువులు లేదా ముప్పు కలిగించే పదార్థాలను గుర్తించి వెంటనే హెచ్చరిక ఇవ్వగల సదుపాయాన్ని ఇది కలిగి ఉంది. ఈ సృజనాత్మక ప్రాజెక్ట్‌ను తయారు చేసిన బొమ్మకంటి మనోజ్ఞ, దేశ భద్రతను మెరుగుపరచాలన్న ఆలోచనతో ఈ యంత్రాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రదర్శనను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు పాలనాధికారి విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్ తదితర అధికారులు ఈ పరికరాన్ని ప్రశంసించారు. ఈ ప్రాజెక్ట్‌కు మార్గదర్శకత్వం వహించిన తాడిచెర్ల ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ కుమార్‌స్వామి, విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సామాజిక బాధ్యతాభావం పెంపొందడం సంతోషకరమని అభిప్రాయపడ్డారు. దేశ భద్రతను బలోపేతం చేయడంలో విద్యార్థుల ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తున్నాయనే మాట మరోసారి ఈ ప్రాజెక్ట్ ద్వారా రుజువైంది.

# మాసాయిపేట సర్పంచ్ పదవికి కాంగ్రెస్ అభ్యర్థి కృష్ణారెడ్డి నామినేషన్



**మెదక్ , డిసెంబర్ 05 ( ప్రభాత జాగృతి):** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని మాసాయిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తరపున సర్పంచ్ అభ్యర్థి కృష్ణారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరై పార్టీకండువా కప్పి అభినందనలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం ప్రధాన అనుభావంగా ముందుకు సాగుతున్న కృష్ణారెడ్డికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గ్రామ సమస్యలను పరిష్కరించడంలో, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంలో కాంగ్రెస్ పాలన సంకల్పబద్ధంగా పనిచేస్తుందని నామినేషన్ సందర్భంగా ఆయన తెలిపారు. “మాసాయిపేట గ్రామాన్ని ప్రజల సహకారంతో సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్తాం. గ్రామ ప్రజల ఆశయాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా కృషి చేస్తాం” అని కృష్ణారెడ్డి చెప్పారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంతో మాసాయిపేట అభివృద్ధికి బలమైన పునాది పడుతుందని నాయకులు, స్థానిక కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామంలో రాజకీయ వాతావరణం మరింత ఆసక్తికరంగా మారింది.

# సర్పంచ్ గా గెలిపిస్తే రామంతపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

**కాంగ్రెస్ అభ్యర్థి వర్గంటి అనిత గణేష్**



**మెదక్ , డిసెంబర్ 05 ( ప్రభాత జాగృతి):** మెదక్ జిల్లా మాసాయిపేట మండలం కేంద్రంలో శుక్రవారం నాడు కాంగ్రెస్ పార్టీ తరపున రామంతపూర్ కాంగ్రెస్ అభ్యర్థిగా వర్గంటి అనిత గణేష్ నామినేషన్ వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్పంచిగా గెలిపిస్తే రామంతపురం గ్రామ అభివృద్ధిలో ముందు ఉంచుతానని అన్నారు. అలాగే వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరపున నర్సాపూర్ కాంగ్రెస్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి సహకారంతో రామంతపూర్ గ్రామాన్ని అన్ని విధాలుగా ముందుస్తానని వర్గంటి అనిత గణేష్ తెలిపారు. వీరి వెంట చుంచనకోట శ్రీకాంత్ గౌడ్, పెరమండ్ల శివరాములు, ముక్కనర్సిములు, పెరమండ్ల చందు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక వర్గాల ఉపాధ్యాయులకు ఎలక్షన్ డ్యూటీ నుండి మినహాయింపు ఇవ్వాలి : యూటీఎఫ్



**సిద్దిపేట , డిసెంబర్ 05 ( ప్రభాత జాగృతి ):** సిద్దిపేట జిల్లా గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వికలాంగులు, గర్భిణీలు, ఫీడింగ్ మదర్స్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, రిటైర్మెంట్ సమీపంలో ఉన్న ఉపాధ్యాయులకు ఎలక్షన్ డ్యూటీ నుండి మినహాయింపు ఇవ్వాలంటూ టీఎస్ యుటిఎఫ్ జిల్లా నాయకులు జిల్లా విద్యాధికారి & ఎలక్షన్స్ మ్యాన్ పవర్ నోడల్ ఆఫీసర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ నరసింహులు ఈరోజు డి ఈ ఓ కార్యాలయంలో అధికారిని కలిసి ఉపాధ్యాయుల సమస్యలను వివరించారు. ఎన్నికల సమయంలో ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్న వారికి డ్యూటీ విధించడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని, అందువల్ల సంబంధిత వర్గాల ఉపాధ్యాయులను మినహాయించాలని కోరారు. వినతి పత్రాన్ని స్వీకరించిన విద్యా శాఖ అధికారి, వ్యక్తిగతంగా సమర్పించిన అప్లికేషన్లు మరియు సంబంధిత ధృవపత్రాలను సమగ్రంగా పరిశీలించి, కలెక్టర్ ఆమోదం కోసం పంపిస్తామని తెలిపారు. అర్హత కలిగి నిజమైన కారణాలు చూపిన అభ్యర్థులను ఎలక్షన్ డ్యూటీ నుండి తప్పిస్తామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల సంక్షేమం దృష్ట్యా యుటిఎఫ్ ఈ చర్యను ముందుకు తెచ్చిందని జిల్లా నాయకులు పేర్కొన్నారు.

# జాతీయ రహదారిపై అదుపు తప్పి ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

**అశ్వారావుపేట , డిసెంబర్ 05 ( ప్రభాత జాగృతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల పరిధిలోని నారంవారిగూడెం గ్రామంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఓ స్విఫ్ట్ కారు ప్రమాదానికి గురైంది. జాతీయ రహదారిపై వెళుతున్న ఈ కారు అదుపుతప్పి పక్కనే ఉన్న ఇంట్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు ఇది చూసిన స్థానికులు తెలిపారు. ఈ కారు డ్రైవరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదానికి ఓవర్ స్పీడ్ కారణమని స్థానికులు అంటున్నారు.

# ఎన్నికల విధులు కట్టుదిట్టంగానిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- మొదటి విడత పోలింగ్ జరిగే మండలాలలో పర్యటించిన జిల్లా కలెక్టర్

**మంథని, డిసెంబర్-05 (ప్రభాత జాగృతి) :**



పంచాయతీ ఎన్నికల విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని *జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష* తెలిపారు. శుక్రవారం కలెక్టర్ మొదటి విడత పోలింగ్ జరిగే కమాన్ పూర్ , రామగిరి మంథని ,ముత్తారం, శ్రీరాంపూర్ మండలాల లోని ఎంపీడీవో కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పంచాయతీ ఎన్నికల సంబంధించి డిసెంబర్ 6న పోలింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమం కట్టుదిట్టంగా నిర్వహించాలని, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎంపిడివో కార్యాలయం వద్ద ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. బ్యాలెట్ పత్రాల ముద్రణ పంపిణీ నిబంధన ప్రకారం సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పంచాయతీ ఎన్నికల సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల, రిసెప్షన్ సెంటర్లో వద్ద ఏర్పాట్లు పై కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం మంథని పట్టణంలోని శ్రీపాద మార్గ్ 4 లైన్ విస్తరణ పనుల కోసం అలైన్మెంట్ ను కలెక్టర్ పరిశీలించి ట్రెంచ్ కట్టింగ్ పనులు సజావుగా జరిగేలా చూడాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వింటే మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, జడ్పీ సీఈఓ నరేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన

- ఫ్రాడ్ కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటన చేస్తే కఠిన చర్యలు
- చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్




**భూపాలపల్లి , డిసెంబర్ 05 ( ప్రభాత జాగృతి):** సైబర్ నేరాల నివారణ కోసం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలంలోని అమ్మ గార్డెన్ లో చిట్యాల సిఐ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో మొగుళ్లపల్లి ఎస్సై బి అశోక్ తొ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపు లక్ష్యంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" పేరుతో 42 రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాల లో భాగంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ఫ్రాడ్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి ఎలాంటి స్టాక్ మార్కెట్లో పెట్టుబడి తక్కువ సమయంలో ఎక్కువ లాభం లాంటి మోసపూరిత పెట్టుబడి గురించి, డిజిటల్ అరెస్ట్ వంటి బయపెట్టే మరియు మభ్యపెట్టే విధంగా వచ్చే అపరిచిత కాల్స్ పట్ల జాగ్రత్త వహించాలి అని తెలిపారు అలాగే ఎలక్షన్స్ లో భాగంగా ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలు సోషల్ మీడియాలో గాని వాట్సాప్ లో చేయవద్దని ఒకవేళ ఇలాంటి చేస్తే ఆ గ్రూప్ యొక్క అడ్మిన్స్ బాధ్యులుగా చేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వివిధ రకాల సైబర్ నేరాలు పట్ల అప్రపత్తంగా ఉండాలి అని ఈ విధంగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. అంతేకాకుండా నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నందున ఏ అనుమానాస్పద లింకులు లేదా ఫైళ్లను క్లిక్ చేయవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 కు కాల్ చేయాలని, అలాగే NCRP www.cybercrime.gov.in 5 సంబంధిత పోలీస్ అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది శ్రీనివాస్ ప్రభాకర్ కృష్ణ నవీన్ శంకర్ అజయ్ పాల్గొన్నారు

# బీబీపేట్‌లో జోరందుకున్న ప్రచారం



**బీబీపేట్ , డిసెంబర్ 05 ( ప్రభాత జాగృతి):** బీబీపేట్ మండల కేంద్రంతో పాటు మండలంలోని 11 గ్రామాల్లో మొదటి విడతలో జరిగే ఎన్నికల ప్రచారం జోరందుకుంది. నిన్న మొన్నటి దాకా నిశ్శబ్దంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా రాజకీయ ప్రచారం వేడెక్కింది. మండల కేంద్రంలో ఐదుగురు అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉండగా ప్రధానంగా ముగ్గురు అభ్యర్థులు ప్రచారంలో ముందున్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. రాత్రికి రాత్రి కులాల ,వర్గాల వారిగా సమావేశాలు ఏర్పాటు చేసి విందులు ఏర్పాటు చేసి ఆయా సంఘాలు, వర్గాలు కోరిన విదంగా తాయిలాలు ప్రకటించి ఓటర్లను మచ్చిక చేసుకునే ప్రయత్నాలు ముఖ్య నేతలు ప్రారంభించారు. మండల కేంద్రంలో కొన్ని ప్రాంతాల్లో నీటి సమస్య తీర్చే ప్రయత్నంలో ఆడిగిందే తడవుగా బోరు బావులు వేయించి ఓటర్ల మన్ననలు పొందే ప్రయత్నంలో దూసుకుపోతున్నారు మండల కేంద్రంలో ప్రధానంగా ముగ్గురు ప్రధాన అభ్యర్థుల మద్యే పోటీ నెలకొందని, ఈ పోటీలో ప్రధానంగా డబ్బు ప్రభావం చూపుతుందని కొందరు అభిప్రాయపడగా ,ఆయా అభ్యర్థులు గతంలో చేసిన సేవా కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులో ఉండి సత్వర సమస్యల పరిష్కారం కోసం ఆలోచించే వ్యక్తికి కూడా సానుభూతి ఓట్లు పడే అవకాశం ఉందని మరికొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏది ఏమైనా ఓటర్ల విలక్షణమైన తీర్పు ప్రచార ఘట్టంలో తుది దశకు చేరుకునే వరకు అభ్యర్థుల విజయాలు, అపజయాలు అంచనా వేయలేమని కొందరు అభిప్రాయపడుతున్నారు. బరిలో ఉన్న అభ్యర్థులు తమ తమ బలాబలాలు చూయించుకునే ప్రయత్నంలో తమ అనుచర వర్గంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేయగా ఒకరిద్దరైతే ప్రచారంలో పాల్గొన్నడానికి అనుచర వర్గాన్ని సమకూర్చడానికి నానా తంటాలు పడుతూ తమ వెంట ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వారికి తాయిలాలు ఇస్తున్నారన్న ప్రచారం, విమర్శలు లేకపోలేదు. ప్రచార ఘట్టంలో అభ్యర్థులు అనుసరిస్తున్న విధానాలపై పలువురు వ్యగ్యాంగా మాట్లాడుతూ ఐదు రోజుల పాటు ఓటర్లకు పండగే పండగకి వ్యాఖ్యానించారు. ఏది ఏమైనా ఈ సారి ఎన్నికల్లో డబ్బు, విందులు, తాయిలాలు ఎవరు ఎక్కువగా ఉపయోగిస్తే వారే విజేతలని వాపోతుండగా ఓటర్లు తమ విలక్షణమైన తీర్పులో ప్రస్తుత పరిస్థితుల్లో అంచనా వేయడం కష్టంగా మారిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# నిజామాబాద్ అర్బన్ అంతర్ పాఠశాల క్రీడోత్సవాల మహోత్సవం ఘనంగా ముగింపు



**నిజామాబాద్, డిసెంబర్ 05 ( ప్రభాత జాగృతి):** ఎంవి సుబ్బారావు స్మారకంగా నిర్వహించిన నిజామాబాద్ అర్బన్ అంతర్ పాఠశాల క్రీడోత్సవాల మహోత్సవ ముగింపు సమావేశం గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ప్రధాన అతిథిగా పాల్గొన్న స్థానిక శాసనసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ విజేతలకు పతకాలు, ట్రోఫీలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల దశలో క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ధైర్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జిల్లాలో క్రీడా సదుపాయాలను మరింత బలోపేతం చేయేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో కలెక్టరేట్ గ్రౌండ్‌ను వాణిజ్య ప్రయోజనాల కోసం మార్చే యత్నాలను అడ్డుకు మైదానాన్ని క్రీడల కోసం కాపాడగలిగినందుకు సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో నిజామాబాద్ జిల్లాకు ప్రత్యేక స్టేడియం అవసరాన్ని బలంగా ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో అసోసియేషన్ నిర్వహించే ఏ కార్యక్రమానికైనా తన ట్రస్ట్ తరపున అన్ని విధాల సహకారం అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు అజ్మత్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మీసాల ప్రశాంత్, ట్రెజరర్ గంగ మురళి, బీజేపీ నాయకులు, వివిధ పాఠశాలల ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తండ్రిపై పోటీకి వచ్చిన తనయుడు

**ఎన్నికల మూడో విడత నామినేషన్ల స్వీకరణ కార్యక్రమంలో రచ్చ రచ్చ**



**మెదక్ , డిసెంబర్ 05 ( ప్రభాత జాగృతి):** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలంలోని వెల్దుర్తి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఘర్షణ వాతావరణం నెలకొంది. మండలంలోని శంషారెడ్డిపల్లి తండా గ్రామపంచాయతీ స్థానం ఎస్టి జనరల్ రిజర్వ్ కాగా ఆ గ్రామం నుంచి ఒక్కరే సర్పంచ్ స్థానానికి బానోత్ గణేష్ నామినేషన్ దాఖలు చేశారు. చివరి క్షణంలో గణేష్ పై తన తనయుడు బానావత్ వినోద్ తన తండ్రి పైనే నామినేషన్ వేసేందుకు రాగా తండా వాసులు ఏకగ్రీవం చేసుకుందామని వారించారు. వినోద్ తను వినను అని పోటీలో ఉంటానని నామినేషన్ పత్రాలతో ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలోకి వెళ్ళగా అక్కడే ఉన్న గిరిజనులు ఆయనను నామినేషన్ వేయవద్దని అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. అప్పటికి అక్కడ ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. మనస్థాపానికి గురైన వినోద్ పత్రాలను చించి వేసి ఆరు బయటకు వచ్చారు. ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్ వేసేందుకు వచ్చిన వారికి రక్షణ కల్పించాల్సిన అధికార యంత్రాంగం ఈ తతంగం చూసి చూడనట్లుగా వ్యవహరించడంతో అక్కడ గల పలువురు ఇదేమి రాజ్యాంగం అంటూ చర్చించుకున్నారు.

# మహిళ అనుమానాస్పద మృతి



**మెదక్ , డిసెంబర్ 05 ( ప్రభాత జాగృతి):** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలం పెద్దపూర్ గ్రామ శివారులో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది.విషయం తెలుసుకున్న వెంటనే తూప్రాన్ సిఐ రంగా కృష్ణ, ఎస్సై రాజు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. సిఐ వివరాల ప్రకారం మృతురాలు దసరి నర్సమ్మ (38) మృతురాలు సత్తయ్య భార్యగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సిఐ రంగా కృష్ణ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.

# చందు నాయక్ బరిలో ఉంటే వారు వన్ సైడ్ అంటున్న ఓటర్లు

- ప్రజాభిమానంతో గెలుపు బరిలో ముందున్న చందు నాయక్
- సర్పంచ్ సీటు కైవసం చందు నాయక్ కే సాధ్యం
- ముచ్చటగా మూడోసారి సర్పంచిగా చందు నాయక్ గెలుపు ఖాయం



**భద్రాద్రి కొత్తగూడెం , డిసెంబర్ 05 ( ప్రభాత జాగృతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక పంచాయతీ స్వతంత్ర అభ్యర్థిగా సర్పంచ్ బరిలో ధరావత్ చందు నాయక్ ప్రచారంలో బ్యాటు గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. గెలుపే లక్ష్యంగా దూసుకుపోతూ, చందు నాయక్ బరిలో ఉంటే ప్రతిపక్ష పార్టీలలో గుండెల్లో దడలు పుట్టిస్తూ, ధరావత్ చందు నాయక్ పై ప్రజానీకానికి ఉన్న నమ్మకం తో గెలుపు ఒక్కడికే సాధ్యం అంటున్న సారపాక ఓటర్లు. ఎవరు ఎన్ని హామీలు ఇచ్చిన ఎవరు ఎన్ని మాయ మాటలు చెప్పిన ప్రజల గుండెల్లో వారి తండ్రి ప్రజలకు చేసిన సేవలు దగ్గర నుండి అదే బాటలో నడుస్తున్న తండ్రికి తగ్గ తనయుడిగా వారిపై ఉన్న అభిమానాన్ని ఆయనకు గల సేవా గుణాన్ని ఎన్నటికీ మర్చిపోలేము అంటున్న స్థానికులు, అందువల్ల పూర్తి భరోసాతో సింగిల్ గా వచ్చి సర్పంచ్ సీటు ఎక్కేస్తాడు, అంటూ చందు నాయక్ అభిమానులు మద్దతుదారులు. సారపాక సర్పంచ్ అభ్యర్థి చందు నాయక్ ప్రచారంలో పాల్గొన్న స్థానిక ప్రజలను చూసి నివ్వరపోతున్న ప్రతిపక్ష పార్టీల నాయకులు. ఇంతటి ప్రజాదరణ ఉన్న సర్పంచిగా గెలుపు మూడవ సారి కూడా ఖాయమంటు సర్పంచ్ కుర్చీని కైవశం చేసుకుంటాడు అంటున్న కొందరు రాజకీయ విశ్లేషకులు...

# పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



**నిజామాబాద్ , డిసెంబర్ 05 ( ప్రభాత జాగృతి):** రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సాలుర గ్రామంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆదేశాల మేరకు బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఫ్లాగ్ మార్చ్ ప్రధాన ఉద్దేశం ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడం, శాంతి-భద్రతలను బలోపేతం చేయడం, అలాగే ఎన్నికల ప్రక్రియలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం. బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు అదనపు బలగాలు కూడా పాల్గొన్నాయి. గ్రామస్తులకు చట్టశాంతి పరిరక్షణపై అవగాహన కల్పించే క్రమంలో ఎన్నికల నియమాలను కచ్చితంగా పాటించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులను సమాచారం చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో గందరగోళం సృష్టించడం, బెదిరింపులు చేయడం, డబ్బు-మద్యం పంపిణీ లేదా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఈ ప్రాంతంలో స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక, శాంతియుత ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపింది. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ, బోధన్ రూరల్ సీఐ, బోధన్ ఎస్సెచ్ఓ, బోధన్ రూరల్ ఎస్సై, ఎడపల్లి ఎస్సై, రెంజల్ ఎస్సైతో పాటు స్పెషల్ పార్టీ బృందాలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులకు షాక్

**చట్టం, డిసెంబర్ 05 ( ప్రభాత జాగృతి):** పదవులు పొందేందుకు అధికారంలో ఉన్న పార్టీ ఎంతకైనా తెగిస్తుంది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులను నామినేషన్ వేయకుండా భయపెట్టించడం.. బెదిరింపులకు దిగడం.. అవసరమైతే అభ్యర్థులతో పాటు నాయకులపై నాయకులపై దాడులకు పాల్పడుతూకిడ్నాప్లు చేయడం చేస్తుంటారు. కానీ సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం అత్తునూర్ గ్రామంలో సీన్ రివర్స్ అయింది. మూడో విడత సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో గ్రామ సర్పంచ్ స్థానాన్ని జనరల్ మహిళకు కేటాయించారు. అలాగే 8 వార్డు రిజర్వేషన్లను అయితే అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు గ్రామ సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ వేసేందుకు గురువారం సిద్ధమయ్యారు.

## పురుషులు అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండాలంటే..

# రోజూ వీటిని తినాలి..!

### గుండె, ప్రోస్టేట్ ఆరోగ్యానికి..

పురుషులకు సాధారణంగా స్త్రీలకన్నా గుండె జబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కనుక వారు గుండె ఆరోగ్యంగా ఉండేందుకు గాను ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో పురుషులు తృణ ధాన్యాలను అధికంగా తినాలి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచుతాయి. దీని వల్ల రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. ఫలితంగా హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. అలాగే పురుషుల్లో ప్రోస్టేట్ సమస్యలు వస్తాయి కనుక వారు ఆ గ్రంథి ఆరోగ్యంగా ఉండేందుకు కూడా ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది. తృణ ధాన్యాలను తినడం వల్ల ప్రోస్టేట్ సమస్యలు తలెత్తకుండా ఉంటాయి. అలాగే కండరాల ఆరోగ్యం మెరుగు పడుతుంది. కండరాలు దృఢంగా మారుతాయి. శక్తి లభిస్తుంది. ఉత్సాహంగా మారుతారు. చురుగ్గా పనిచేస్తారు. అలాగే పురుషుల్లో టెస్టోస్టిరాన్ ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో సంతానం కలిగే అవకాశాలు మెరుగు పడతాయి. అలాగే శరీరంలో రక్త సరఫరా మెరుగు పడి బీపీ తగ్గుతుంది. ఓట్స్, బ్రౌన్ రైస్, కినోవా వంటివి తృణ ధాన్యాల జాబితాకు చెందుతాయి. వీటిని పురుషులు రోజూ తింటుంటే ఆరోగ్యంగా ఉంటారు.

**ఆరోగ్యంగా ఉండడం కోసం అన్ని పోషకాలు కలిగిన ఆహారాలను రోజూ తినాలని మనకు వైద్యులు, పోషకాహార నిపుణులు సూచిస్తుంటారు. ఈ క్రమంలోనే చాలా మంది ఆరోగ్యం కోసం సరైన డైట్‌ను పాటిస్తుంటారు. అయితే పురుషులు తమ ఆరోగ్యం కోసం పనికొచ్చే ఆహారాలను ప్రత్యేకంగా తీసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే పురుషులకు వయస్సు రీత్యా, ఇతర కారణాల వల్ల అనేక సమస్యలు వస్తుంటాయి. అలాంటప్పుడు అందరూ రెగ్యులర్ గా పాటించే డైట్‌ను కాకుండా కాస్త భిన్నమైన ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది. పురుషులు తమకు అధికంగా వచ్చే సమస్యలను బట్టి డైట్‌ను ప్లాన్ చేసుకోవాలి. పురుషుల శరీరం స్త్రీల కన్నా భిన్నమైన నిర్మాణం, అవసరాలను కలిగి ఉంటుంది. కనుక వారు కాస్త భిన్నమైన ఆహారాలను తీసుకోవాలి. అవి వారి ఆరోగ్యానికి దోహదం చేసేవి అయి ఉండాలి. అలా ఉంటేనే పురుషులు ఆరోగ్యంగా ఉంటారు. ఎలాంటి రోగాలు రాకుండా చూసుకోవచ్చు. ఇక పురుషులు ఆరోగ్యంగా ఉండాలంటే కచ్చితమైన డైట్‌ను పాటించాల్సి ఉంటుంది.**



### పాలకూర, నట్స్, సీడ్స్..

పాలకూర కూడా పురుషుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఉండే మెగ్నిషియం రక్త నాళాలను వెడల్పు చేస్తుంది. రక్త నాళాల వాపులను తగ్గిస్తుంది. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. బ్లడ్ క్లాట్స్ కరిగిపోతాయి. హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉంటారు. పాలకూరలో ఉండే ఫోలేట్ వల్ల పురుషుల్లో హొమోసిస్టీన్ లెవల్స్ తగ్గుతాయి. హొమోసిస్టీన్ వల్ల రక్త నాళాల్లో క్లాట్స్ ఏర్పడి హార్ట్ ఎటాక్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కనుక హొమోసిస్టీన్ తగ్గాలంటే పాలకూరను తినాల్సి ఉంటుంది. దీని వల్ల పురుషులు తమ గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. అలాగే బాదంపప్పు, జీడిపప్పు, పిస్తా, వాల్ నట్స్, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, అవిసె గింజలు, చియా సీడ్స్ వంటి నట్స్, సీడ్స్‌ను పురుషులు రోజూ తినేలా ప్లాన్ చేసుకోవాలి. వీటిల్లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరంలోని కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

### విటమిన్ ఇ, జింక్..

ఇక నట్స్, సీడ్స్‌ను తినడం వల్ల పురుషులకు అధిక మొత్తంలో విటమిన్ ఇ లభిస్తుంది. ఇది పురుషుల్లో ఉండే నపుంసకత్వ సమస్యను తగ్గిస్తుంది. శృంగార సామర్థ్యం పెరిగేలా చేస్తుంది. అలాగే వీర్యం ఉత్పత్తిని పెంచుతుంది. శుక్ర కణాల కదలిక సరిగ్గా ఉండేలా చేస్తుంది. దీని వల్ల సంతానం కలిగే అవకాశాలు మెరుగు పడతాయి. పురుషులు చేపలను కూడా తరచూ తింటుండాలి. వీటిల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ప్రోస్టేట్ గ్రంథిని రక్షిస్తాయి. దీంతో ప్రోస్టేట్ క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే కోడిగుడ్లు, పుట్టగొడుగులు, మటన్ లివర్, రొయ్యలు వంటి జింక్ అధికంగా ఉండే ఆహారాలను కూడా పురుషులు రోజూ తీసుకోవాలి. వీటి వల్ల రోగ నిరోధక శక్తిపెరగడమే కాదు, ప్రోస్టేట్ క్యాన్సర్ ముప్పు తగ్గుతుంది. టెస్టోస్టిరాన్ ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో శృంగారంలో చురుగ్గా పాల్గొంటారు. ఆరోగ్యంగా ఉంటారు. ఇలా పురుషులు ఆయా ఆహారాలను తరచూ తీసుకుంటే అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# ఉత్సాహాన్నిచ్చే హార్మోన్ ఫుడ్



మనం ఏం చేశాం, ఏం చేయలేదు అన్నదానితో సంబంధం లేకుండా ఊరికే కొందరు అలసటకు గురవుతుంటారు. మధ్యాహ్నంలోపే సత్తువ లేనట్టు అయిపోతుంటారు. ఇది హార్మోన్ల అసమతుల్యతకు సంకేతం అంటున్నారు ఆరోగ్యనిపుణులు. వీటిని బ్యాలెన్స్ చేసుకునేందుకు మందులతో అవసరం లేకుండా కొన్ని ఆహార చిట్కాలనూ సూచిస్తున్నారు.

సరిపడా నీళ్లు తాగడం వల్ల మెదడు త్వరగా అలసిపోదు. అలాగే నీళ్లలో పుదీన, నిమ్మరసం, బెర్రీల్లాంటి ఇతర పండ్లను చేర్చడం ద్వారా హార్మోన్ల పనితీరూ మెరుగవుతుంది.

గ్రీక్ యోగర్ట్, పప్పు దినుసులు, టోఫు, గుడ్డులాంటివి ఒత్తిడిని కలిగించే హార్మోన్ అయిన కార్టిసోల్ స్థాయులను తగ్గిస్తాయి. అంతేకాదు, వీటిలో ఉండే ప్రొటీన్ రోజంతా ఉత్సాహంగా పనిచేయడానికి ఉపకరిస్తుంది.

మంచి జీర్ణవ్యవస్థ మన హార్మోన్ల స్థాయిని సమతులంగా ఉంచేందుకు సాయపడుతుంది. అందుకోసం పీచు పదార్థాలు బాగా తినాలి. పీచులు ఉండే బీర, సొర, చిక్కుడులాంటి కూరగాయలు, తృణ ధాన్యాలు, చియా గింజల్లాంటివి ఇందుకోసం తీసుకోవాలి.

శరీరంలో మెగ్నీషియం పుష్కలంగా ఉంటే తక్కువగా అలసటకు గురవుతారు. డార్క్ చాకొలెట్, పాలకూర లాంటి వాటిల్లో ఇది పుష్కలంగా దొరుకుతుంది. మెగ్నీషియం స్ట్రెస్ హార్మోన్లను నియంత్రణలో ఉంచేందుకు, కండరాలు త్వరగా కోలుకునేందుకు సాయపడుతుంది.

నెమ్మదిగా జీర్ణమయ్యే కార్బోహైడ్రేట్లు కూడా హార్మోన్ల అసమతుల్యతను పోగొట్టేందుకు పనిచేస్తాయి. అందుకోసం క్వినోవా, చిలగడదుంప, ఓట్స్‌లాంటివి తింటే సరి.

# డిప్రెషన్ అసలు ఎందుకు వస్తుంది..?

## ఇది ఉన్నవారిని ఎలా గుర్తించాలి..? ఏమేం ఆహారాలను వారికి ఇవ్వాలి..?



పూర్వం ప్రజలు ఎలాంటి మానసిక అనారోగ్య సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉండేవారు. అప్పట్లో వాళ్లకు ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ అంటే అసలు తెలియదు. రోజంతా శారీరక శ్రమ చేసేవారు. రాత్రికి హాయిగా నిద్రపోయేవారు. కానీ ప్రస్తుతం అంతా బిజీ యుగం నడుస్తోంది. నిత్యం ఉదయం నిద్ర లేచిన దగ్గర నుంచి రాత్రి మళ్లీ నిద్రించే వరకు అనేక రకాల పనులను వేగంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అనేక మంది పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. అలాగే కుటుంబ సమస్యలు కూడా ఉంటున్నాయి. అనేక రకాల సమస్యలతో ప్రస్తుతం సగటు మానవుడు కొట్టు మిట్టాడుతున్నాడు. దీంతో చాలా మందికి మానసిక ఆరోగ్యం దెబ్బ తింటోంది. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ వచ్చి మానసికంగా కుంగిపోతున్నారు. చిన్న విషయాలకే తీవ్ర మనస్థాపం చెంది బలవంతంగా ప్రాణాలను సైతం తీసుకుంటున్నారు. అయితే మానసిక సమస్యలు వచ్చేందుకు ఇవే కాదు, ఇంకా అనేక కారణాలు కూడా ఉంటాయని మానసిక వైద్యులు చెబుతున్నారు.

### డిప్రెషన్‌కు కారణాలు..

మానసిక సమస్యలు వచ్చేందుకు శరీరంలో జరిగే రసాయనిక చర్యలు కూడా కారణం అవుతాయని మానసిక వైద్యులు చెబుతున్నారు. శరీరంలో అనేక రకాల రసాయన చర్యలు సక్రమంగా నిర్వహించబడితే ఎలాంటి శారీరక, మానసిక సమస్యలు ఉండవు. కానీ రసాయనిక చర్యలు సరిగ్గా జరగపోతే అప్పుడు శరీరం మానసికంగా, శారీరకంగా రోగాల బారిన పడుతుంది. ముఖ్యంగా సెరొటోనిన్, డోపమైన్ వంటి న్యూరో ట్రాన్స్‌మిటర్ల చర్యలు సరిగ్గా లేకపోతే ముందుగా మానసిక ఆరోగ్యం దెబ్బ తింటుంది. ఇక వంశ పారంపర్యంగా కూడా డిప్రెషన్ బారిన పడే అవకాశాలు ఉంటాయి. ముఖ్యంగా కొందరికి ఈ సమస్య తరతరాలుగా వంశ పారం పర్యంగా అలాగే వస్తుందని కూడా మానసిక వైద్యులు చెబుతున్నారు. అలాగే శరీరంలో హార్మోన్ల అసమతుల్యత ఉన్నా కూడా డిప్రెషన్ బారిన పడతారు. కొందరికి చుట్టూ ఉన్న వాతావరణ పరిస్థితులు కూడా ఈ సమస్యలు వచ్చేందుకు కారణం అవుతాయి. చుట్టూ ఏవైనా తట్టుకోలేని సంఘటనలు జరిగితే కొందరు డిప్రెషన్ బారిన పడతారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలు లేదా దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిలోనూ డిప్రెషన్ ఏర్పడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఇలా మానసిక అనారోగ్య సమస్యలు వచ్చేందుకు పలు కారణాలు ఉంటాయి.

### డిప్రెషన్ ఉన్నవారిలో కనిపించే లక్షణాలు..

డిప్రెషన్ బారిన పడిన వారిలో పలు లక్షణాలు కనిపిస్తాయి. దీంతో వారి మానసిక ఆరోగ్యం దెబ్బ తిన్నదని సులభంగా గుర్తించవచ్చు. డిప్రెషన్ ఉంటే ఎల్లప్పుడూ విచారంగా ఉంటారు. ఏదో కోల్పోయినట్లు ఫీలవుతుంటారు. ఏ పని చేయాలన్నా ఆసక్తి ఉండదు. మూడీగా ఉన్నట్లు కనిపిస్తారు. చుట్టూ ఎంత ఆనందకరమైన వాతావరణం ఉన్నప్పటికీ వారు అసలు ఫీల్ కాలేరు. తీవ్రమైన విషాదంలోనే ఉన్నట్లు ఫీలవుతారు. అలాగే ఏదో తప్పు చేశామన్న భావన కూడా వారిలో ఉంటుంది. దీని వల్ల వారు ఇతరులతో సరిగ్గా మాట్లాడరు. మాట్లాడించినా ముక్తసరిగా సమాధానం చెబుతారు. ఇక డిప్రెషన్ ఉంటే సడెన్‌గా బరువు తగ్గడం లేదా పెరగడం జరుగుతుంది. కొందరికి విపరీతమైన ఆకలి ఉంటుంది. కొందరికి తిండి అంటే ఆసక్తి పూర్తిగా తగ్గిపోతుంది. తీవ్రమైన అలసట, నీరసం కూడా ఉంటాయి. డిప్రెషన్ ఉన్నవారు నిద్ర కూడా సరిగ్గా పోలేరు. ఆలోచనా శక్తి తగ్గిపోతుంది. ఏకాగ్రత ఉండదు. నిర్ణయాలు తీసుకోలేకపోతుంటారు. ఏ విషయాలను కూడా సరిగ్గా గుర్తు పెట్టుకోలేకపోతుంటారు. మాటలు నెమ్మదిగా మాట్లాడుతారు. ఇక కొందరికి ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనలు వస్తాయి. ఎల్లప్పుడూ చావు గురించే ఆలోచిస్తారు. ఇలా డిప్రెషన్ వచ్చిన వారిని చాలా సులభంగా గుర్తించవచ్చు.

### తినాల్సిన ఆహారాలు..

డిప్రెషన్ లేదా మానసిక అనారోగ్య సమస్యలు ఉన్నవారికి పలు ఆహారాలను ఇవ్వడం ద్వారా వారిలో మార్పు తీసుకురావచ్చు. దీంతో వారి మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది. ఇందుకు గాను పలు పోషకాలు ఉండే ఆహారాలను వారు తినాల్సి ఉంటుంది. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉండే చేపలు, రొయ్యలు, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, బాదంపప్పు, వాల్ నట్స్, అవిసె గింజలను తింటుండాలి. ఇవి డిప్రెషన్‌ను తగ్గేలా చేస్తాయి. మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. అలాగే పాలు, కోడిగుడ్లు, చీజ్, అరటి పండ్లు, పాలకూర, పప్పు దినుసులు, బీన్స్, ఓట్ మీల్, బ్రౌన్ రైస్, కినోవా, చిలగడదుంపలు, పెరుగు, నారింజ పండ్లు వంటి ఆహారాలను తీసుకోవడం వల్ల కూడా ఉపయోగం ఉంటుంది. ఇవన్నీ డిప్రెషన్‌ను తగ్గించి మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో ఎంతో సహాయం చేస్తాయి. ఇలా ఆయా ఆహారాలను తీసుకుంటుంటే ఈ సమస్యలను సులభంగా తగ్గించుకోవచ్చు. ఆరోగ్యంగా ఉండవచ్చు.

# ఆసీస్ గడ్డపై రూట్ సెంచరీ

2025 యాషెస్ సిరీస్?లో ఆస్ట్రేలియా- ఇంగ్లాండ్? మధ్య రెండో టెస్టులో తొలి రోజు ఆట ముగిసింది. తొలి ఇన్నింగ్స్?లో తొలుత బ్యాటింగ్ చేస్తున్న ఇంగ్లాండ్ 325-9 స్కోర్?తో ఉంది. క్రీజులో జో రూట్ (135 పరుగులు), జోఫ్రా ఆర్చర్ (32 పరుగులు) ఉన్నారు. ఆసీస్?? బౌలర్లలో మిచెల్ స్టార్క్ 6, మిచెల్ నజీర్, స్కాట్ బొలాండ్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. తొలి ఇన్నింగ్స్?లో రూట్ బ్యాటింగే హైలైట్. తన టెస్టు కెరీర్?లో తొలిసారి ఆస్ట్రేలియా గడ్డపై సెంచరీ సాధించాడు. ఆస్ట్రేలియాలో రూట్? శతకం నమోదు చేసేందుకు 30 ఇన్నింగ్స్?లు తీసుకున్నాడు. అలాగే రూట్? కెరీర్?లో ఇది 40వ టెస్టు సెంచరీ కావడం విశేషం. కెరీర్‌లో లోటుగా మారిన ఈ సెంచరీని సాధించేందుకు జోరూట్‌కు తాజా పర్యటనలో మూడు ఇన్నింగ్స్‌ల సమయం పట్టింది. తొలి టెస్ట్‌లో దారుణంగా విఫలమైన జోరూట్.. పింక్ బాల్ టెస్ట్‌లో తన ట్రేడ్ మార్క్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. మిచెల్ స్టార్క్ ధాటికి ఆదిలోనే బెన్ డకెట్, ఓలీ పోప్ డకౌటవ్వగా.. జాక్ క్రాలీ(76)తో కలిసి జోరూట్ జట్టును ఆదుకున్నాడు. మూడో వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. జాక్ క్రాలీ వెనుదిరిగినా.. హ్యారీ బ్రూక్(31), బెన్ స్టోక్స్(19), విల్ జాక్స్(19), జోఫ్రా ఆర్చర్(32 బ్యాటింగ్)ల సాయంతో విలువైన భాగస్వామ్యాలను నెలకొల్పాడు. ఈ క్రమంలో 83 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న జోరూట్.. 181 బంతుల్లో శతకాన్ని పూర్తి చేశాడు. ఈ భారీ ఇన్నింగ్స్‌తో ఆస్ట్రేలియా గడ్డపై 1000 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఇప్పటి వరకు ఆసీస్ గడ్డపై 30



ఇన్నింగ్స్‌లు ఆడిన జోరూట్ 1006 పరుగులు చేశాడు. ఇందులో తాజా సెంచరీతో పాటు 9 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో జోరూట్‌కు ఇది 22వ సెంచరీ. ఇప్పటికే ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్న జోరూట్.. తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. మరే బ్యాటర్ కూడా అతనికి దరిదాపుల్లో లేడు. డబ్ల్యూటీసీ చరిత్రలో 129 ఇన్నింగ్స్‌లు ఆడిన జోరూట్ 22 శతకాలు చేయగా.. స్టీవ్ స్మిత్ 13, మార్నస్ లబుషేన్ 11, కేన్ విలియమ్సన్ 11, శుభ్‌మన్ గిల్ 10 సెంచరీలతో తర్వాతి స్థానంలో నిలిచారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంగ్లండ్ తరఫున అత్యధిక సెంచరీలు బాదిన బ్యాటర్ల జాబితాలో జోరూట్(59లి) అగ్రస్థానంలో కొనసాగతుండగా.. అలిస్టర్ కుక్(38), కెవిన్ పీటర్సన(32), గ్రహమ్ కోచ్(28), ఆండ్రూ స్ట్రాస్(27) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలతో సచిన్ టెండూల్కర్ అగ్రస్థానంలో ఉండగా.. విరాట్ కోహ్లి(84), రికీ పాంటింగ్(71), కుమార సంగక్కర(63), జాక్వాస్ కల్లీస్(62), జోరూట్(59లి) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. జోరూట్ సెంచరీతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 74 ఓవర్లలో 9 వికెట్లకు 325 పరుగులు చేసింది. క్రీజులో జోరూట్(135 బ్యాటింగ్), జోఫ్రా ఆర్చర్(32 బ్యాటింగ్) ఉన్నాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(6/71) ఆరు వికెట్లు తీయగా.. మైఖేల్ నెజర్, స్కాట్ బోలాండ్ తలో వికెట్ తీసారు.

## టీ20 క్రికెట్‌లో రోహిత్ రీఎంట్రీకి రెడీ

టీమిండియా టెస్టు, వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికిన ఈ స్టార్ బ్యాటర్, దేశవాళీ టీ20 టోర్నమెంట్ అయిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆడేందుకు సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.రోహిత్ శర్మ తన సొంత జట్టు ముంబై తరపున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లలో ఆడేందుకు ఆసక్తి చూపించినట్లు సమాచారం. ఈ విషయాన్ని ముంబై క్రికెట్ అసోసియేషన్ వర్గాలు ధృవీకరించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ముంబై జట్టు లీగ్ దశలో అద్భుత ప్రదర్శనతో నాకౌట్‌కు చేరడం ఖాయంగా కనిపిస్తోంది.

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లు డిసెంబర్ 12 నుంచి 18 మధ్య జరగనున్నాయి.

ప్రస్తుతం రోహిత్ శర్మ దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ఆడుతున్నారు. ఈ సిరీస్ డిసెంబర్ 6న ముగుస్తుంది. ఆ తర్వాత రోహిత్ ముంబై జట్టుకు అందుబాటులో ఉంటారు. 2024 టీ20 వరల్డ్ కప్ విజయానంతరం రోహిత్ శర్మ అంతర్జాతీయ టీ20లకు గుడ్ బై చెప్పిన సంగతి తెలిసిందే.

ఇప్పుడు మళ్లీ టీ20 ఫార్మాట్‌లో బ్యాట్ పట్టుకునేందుకు సిద్ధమవ్వడం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాబోయే ఐపీఎల్ సీజన్‌కు సన్నాహకంగా రోహిత్ ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏది ఏమైనా, హిట్ మ్యాన్ మరోసారి టీ20ల్లో మెరుపులు మెరిపించనుండటం ముంబై జట్టుకు అదనపు బలాన్ని చేకూర్చనుంది.



## సెలెక్టర్లపై రింకూ అభిమానుల ఆగ్రహం

దక్షిణాఫ్రికాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు బీసీసీఐ జట్టును ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ 15 మంది ఆటగాళ్లకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు, శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా, హార్దిక్ పాండ్యా తిరిగి జట్టులోకి వచ్చారు. రింకు సింగ్‌ను జట్టు నుంచి తొలగించడంపై చాలా మంది అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, సోషల్ మీడియాలో సెలెక్టర్లను విమర్శిస్తున్నారు.రింకు సింగ్ ఫినిషర్ పాత్ర పోషిస్తున్నాడు, అయితే అతనికి ప్లేయింగ్ ఎలెవెన్‌లో స్థిరమైన అవకాశాలు రాలేదు. హార్దిక్ పాండ్యా గాయం కారణంగా అతను కేవలం ఆసియా కప్ ఫైనల్‌లో మాత్రమే ఆడే అవకాశం లభించింది. ఈ సంవత్సరం, రింకు ఆరు టీ20లలో ఆడాడు, వాటిలో మూడు మ్యాచ్‌లలో బ్యాటింగ్ చేశాడు. అతనికి పరిమిత అవకాశాలు లభించినప్పటికీ, అతను చాలా మ్యాచ్‌లలో తనదైన ముద్ర వేశాడు. ఇప్పుడు, దక్షిణాఫ్రికాతో జరిగే టీ20 సిరీస్ నుంచి తొలగించడంతో, అతని అభిమానులు సెలెక్టర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఒక వినియోగదారుడు రింకు సింగ్ టీ20 గణాంకాలను ప్రస్తావిస్తూ, అతను టీ20లలో భారతదేశపు అత్యుత్తమ ఫినిషర్ అని పేర్కొన్నాడు, అయినప్పటికీ అతన్ని తొలగించారు. మరొక వినియోగదారుడు చీఫ్ సెలెక్టర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై తమకు నచ్చిన ఆటగాళ్లను ఎంచుకున్నారని ఆరోపించారు.మరొక వినియోగదారుడు వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ చివరి ఓవర్లలో వేగంగా పరుగులు చేయలేరని, సంజు శామ్‌సన్ కూడా ఫినిషర్ కాదని రాశారు.రింకు సింగ్ 35 మ్యాచ్‌లలో 25 ఇన్నింగ్స్‌లలో మొత్తం 550 పరుగులు చేశాడు. ఈ ఫార్మాట్‌లో అతని అత్యధిక స్కోరు 69లి, అతని స్ట్రైక్ రేట్ 161.76, సగటు 42.30. అతను టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో మూడు అర్ధ సెంచరీలు సాధించాడు.

## సచిన్ రికార్డుపై కన్నేసిన కోహ్లీ..

రాయ్‌పూర్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో వరుసగా రెండో సెంచరీతో తన ఖాతాలో 53వ వన్డే శతకాన్ని నమోదు చేశాడు టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ. అయితే అంతర్జాతీయ క్రికెట్‌లో మాత్రం విరాట్ కోహ్లీకి ఇది 84వ సెంచరీ. మాస్టర్ బ్లాస్టర్ సచిన టెండూల్కర్ సాధించిన 100 సెంచరీలను సాధించాలంటే కోహ్లీ 16 శతకాలు నమోదు చేయాల్సి ఉంటుంది. శనివారం (డిసెంబర్ 6)న వైజాగ్‌లో జరుగుతున్న సిరీస్‌లో విరాట్ కోహ్లీ మరో వన్డే ఆడతాడు. టెస్టు, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన కారణంగా.. అంతర్జాతీయంగా విరాట్ కోహ్లీ కేవలం వన్డేలకే పరిమితమయ్యాడు. దీంతో కొద్ది మ్యాచ్‌లు మాత్రమే అతను ప్రాతనిధ్యం వహించే అవకాశం ఉంది. ఆ తర్వాత 2026 జనవరిలో న్యూజిలాండ్‌తో మూడు వన్డే మ్యాచ్‌లు ఆడనున్నాడు. ఆ తర్వాత వచ్చే ఏడాది జులైలో ఇంగ్లాండ్ పర్యటనలో భాగంగా వన్డే మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది. వచ్చే ఏడాది జూలైలో ఇంగ్లాండ్ సిరీస్, భారతదేశం కనీసం ఆరు లీగ్ మ్యాచ్‌లు ఆడే 2027 వన్డే ప్రపంచ కప్ మధ్య.. భారతదేశం ఆసియా కప్‌తో పాటు రెండు స్వదేశీ సిరీస్‌లను ఆడుతుంది. అంటే కోహ్లీ 16 సెంచరీలు సాధించడానికి.. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీల రికార్డును చేరుకునేందుకు విరాట్ కోహ్లీకి మరో 20 మ్యాచ్‌లు వరకు అవకాశం ఉంటుందని అంచనా. అయితే 20 మ్యాచ్‌లలో 17 సెంచరీలు చేయడం ఏ ఆటగాడికైనా చాలా కష్టమైన పని, కానీ అది అసాధ్యం అయితే కాదు. కోహ్లీ ఇప్పటివరకు న్యూజిలాండ్‌తో 33 వన్డేలు ఆడాడు. ఆ 33 మ్యాచ్‌లలో అతను ఆరు సెంచరీలు చేశాడు. 2023 వన్డే ప్రపంచ కప్ సెమీఫైనల్‌లో కివీస్‌పై భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ తన 50వ వన్డే సెంచరీని సాధించాడు. అదే విధంగా ఇంగ్లాండ్‌లో కోహ్లీ ఇప్పటివరకు 33 వన్డేలు ఆడాడు.



## అనుష్క మద్దతుకు నెటిజన్లు ఫిదా

దక్షిణాఫ్రికాతో రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా ఓటమి పాలైనప్పటికీ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన అద్భుత శతకంతో అభిమానులను అలరించాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ సెంచరీ సాధించిన వెంటనే ఆయన భార్య, బాలీవుడ్ నటి అనుష్క శర్మ సోషల్ మీడియా వేదికగా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.విరాట్ కోహ్లీ తన 53వ వన్డే శతకాన్ని (ఓవరాల్‌గా 86వ అంతర్జాతీయ సెంచరీ) పూర్తి చేసుకున్న కాసేపటికే, అనుష్క శర్మ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఒక ప్రత్యేక పోస్ట్ పెట్టారు. మైదానంలో విరాట్ కోహ్లీ బ్యాట్ పైకెత్తి ప్రేక్షకులకు అభివాదం చేస్తున్న ఫోటోను షేర్ చేసిన ఆమె, దానికి 'హార్ట్' , 'చప్పట్లు' ఎమోజీలను జత చేశారు. ఎలాంటి రాతపూర్వక క్యాప్షన్ లేకపోయినా, ఈ ఎమోజీలతోనే ఆమె తన భర్త ప్రదర్శన పట్ల ఎంత గర్వంగా ఉందో తెలియజేశారు. ప్రస్తుతం ఈ స్క్రీన్ షాట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ (102), రుతురాజ్ గైక్వాడ్ (105) సెంచరీలతో చెలరేగడంతో భారత్ 358 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే, బౌలర్ల వైఫల్యం కారణంగా దక్షిణాఫ్రికా ఈ లక్ష్యాన్ని ఛేదించి 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జట్టు ఓడిపోయినప్పటికీ, కోహ్లీ పోరాటపటిమకు, అనుష్క మద్దతుకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. గత ఆదివారం రాంచీలో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో, డిసెంబర్ 6, శనివారం విశాఖపట్నంలో జరగనున్న మూడవ, చివరి మ్యాచ్ సిరీస్ విజేతను నిర్ణయించనుంది. సిరీస్ ఆరంభ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ తన 52వ శతకాన్ని సాధించి, భారత్‌ను 349/8 స్కోరుకు చేర్చడంతో అతనికి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఆ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా తమ ఇన్నింగ్స్‌లోని 50వ ఓవర్లో 332 పరుగులకు ఆలౌట్ అయింది. ఇదిలా ఉండగా, డిసెంబర్ 11న తమ 8వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్న అనుష్క, విరాట్ లండన్‌కు మకాం మార్చినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ జంట డిసెంబర్ 2017లో ఇటలీలో అంగరంగ వైభవంగా వివాహం చేసుకున్నారు. వీరికి 2021లో కుమార్తె 'వామిక', 2024 ఫిబ్రవరిలో రెండవ సంతానంగా కుమారుడు 'అకాయ్' జన్మించిన సంగతి తెలిసిందే.



## దక్షిణాఫ్రికాపై కోహ్లీ ఆధిపత్యం

భారత క్రికెట్ 'రన్ మెషిన్' విరాట్ కోహ్లీ మరోసారి మైదానంలో తన ఆధిపత్యాన్ని చాటుతున్నాడు. దక్షిణాఫ్రికాతో రాయ్‌పూర్‌లో జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో కోహ్లీ అద్భుతమైన 102 పరుగులు చేసి తన అంతర్జాతీయ కెరీర్‌లో 84వ శతకం సాధించాడు. ఈ సిరీస్‌లో అతని ఫామ్ అద్భుతంగా ఉంది, ఎందుకంటే మొదటి మ్యాచ్ తర్వాత వరుసగా రెండో మ్యాచ్‌లోనూ అతని బ్యాట్ నుంచి సెంచరీ వచ్చింది. ఈ సెంచరీతో కోహ్లీ వన్డే క్రికెట్‌లో మొత్తం 53 సెంచరీలు పూర్తి చేశాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ప్రారంభ వైఫల్యం తర్వాత విరాట్ కోహ్లీ అద్భుతంగా పుంజుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న సిరీస్‌లో అతని బ్యాట్ ఫైర్ మీద ఉంది. రాయ్‌పూర్‌లో చేసిన 102 పరుగుల సెంచరీతో ఇప్పుడు ఆఫ్రికన్ జట్టుపై అతని వన్డే సెంచరీల సంఖ్య 7కి చేరుకుంది. ఈ ప్రదర్శనతో కోహ్లీ 2027 వన్డే ప్రపంచ కప్‌లో భారత్ కోసం కీలక పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నాడని స్పష్టంగా తెలుస్తోంది. వన్డే ఫార్మాట్‌లో సెంచరీల రికార్డులో విరాట్ కోహ్లీ ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్నాడు. గణాంకాలను పరిశీలిస్తే, కోహ్లీకి శ్రీలంక బౌలర్లు బాగా నచ్చారు. అతను శ్రీలంకతో ఆడిన 56 మ్యాచ్‌లలో 54 ఇన్నింగ్స్‌లలో అత్యధికంగా 10 సెంచరీలు సాధించాడు. ఆ తర్వాత వెస్టిండీస్ ఉంది, దీనిపై కోహ్లీ 43 మ్యాచ్‌ల్లో 9 సెంచరీలు నమోదు చేశాడు. వన్డే సెంచరీలలో సచిన్ టెండూల్కర్ (49) రెండో స్థానంలో, రోహిత్ శర్మ (33) మూడో స్థానంలో ఉన్నారు.రాయ్‌పూర్‌లో 102 పరుగులు చేసి



అవుటైన కోహ్లీకి ఇప్పుడు విశాఖపట్నంలో జరిగే మూడో వన్డేలో చరిత్ర సృష్టించే సువర్ణావకాశం ఉంది. అంతర్జాతీయ క్రికెట్ మూడు ఫార్మాట్‌లలో (టెస్ట్, వన్డే, టీ20) కలిపి 28,000 పరుగులు పూర్తి చేయడానికి కోహ్లీకి ఇప్పుడు కేవలం 90 పరుగులు మాత్రమే అవసరం. మూడో మ్యాచ్‌లో ఈ పరుగులు చేస్తే సచిన్ టెండూల్కర్, కుమార సంగక్కర తర్వాత ఈ ఘనత సాధించిన ప్రపంచ మూడో బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడు. దక్షిణాఫ్రికాపై 33 వన్డేల్లో, విరాట్ కోహ్లీ 31 ఇన్నింగ్స్‌లలో 1741 పరుగులు చేశాడు, 50ం పరుగుల 15 సార్లు సాధించాడు, ఇది ప్రోటీస్‌పై ఏ భారతీయ బ్యాట్స్‌మన్ చేసిన అత్యధిక స్కోరు. రాయ్‌పూర్‌లో తన సెంచరీతో, విరాట్ కోహ్లీ ఇప్పుడు 34 వేర్వేరు వేదికల్లో వన్డే సెంచరీలు సాధించాడు, వివిధ మైదానాల్లో అత్యధిక సెంచరీలు చేసిన టెండూల్కర్ రికార్డును సమం చేశాడు.

ఇది ప్రజా సమస్యల... పరిష్కార సారథి
ప్రభాత జాగృతి
ప్రజా చైతన్య... రథ సారథి
శనివారం
6 డిసెంబర్ 2025



www.prabhathajagruthi.com
Follow :



# రామ్ చరణ్ "పెద్ది" పోరాటం..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న విలేజ్ యాక్షన్ మూవీ "పెద్ది" షూటింగ్ వేగంగా జరుగుతోంది. ప్రతి షెడ్యూల్ కూడా ఎనర్జీతో ముందుకు సాగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌పై కీలక యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్‌కు కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ కూడా పాల్గొంటున్నారు, ఇది చిత్రానికి మరింత క్రేజ్‌ను తీసుకొచ్చింది.ఈ యాక్షన్ బ్లాక్‌ను బాలీవుడ్‌కు చెందిన ప్రముఖ యాక్షన్ మాస్టర్ షామ్ కౌశల్ (దంగల్ ఫేమ్) రూపొందిస్తున్నారు. ఆయనతో పాటు నావకాంత్ కూడా ఈ సన్నివేశాలకు స్టంట్ మాస్టర్‌గా పని చేస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ ఫైట్ సీక్వెన్స్ సినిమా కథలో కీలక మలుపుని చూపించబోతోంది. ప్రేక్షకులు థియేటర్‌లో చూసేటప్పుడు ఇది ఒక ప్రధాన హైలైట్‌గా నిలుస్తుందని టీమ్ చెబుతోంది.ఇదివరకు విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్స్, ఫస్ట్ షాట్ గ్లింప్స్'కు అభిమానుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. రామ్ చరణ్ గెటప్, పాత్ర తీరు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. అలానే, తాజాగా రిలీజ్ చేసిన ఫస్ట్ సాంగ్ కూడా యూట్యూబ్‌లో దుమ్ము రేపుతోంది. ఈ పాట 110 మిలియన్లకు పైగా వ్యూస్ దాటేసి, ఇంకా ట్రెండింగ్‌లోనే కొనసాగుతోంది. ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తుండగా, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. మరో ప్రత్యేకత ఏమిటంటే ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నది మన గొప్ప మ్యూజిక్ డైరెక్టర్ ఏ.ఆర్. రహ్మాన్.సెట్, యాక్షన్, నటీనటులు ప్రతీ విభాగం మీద టీమ్ ఎంత కేర్ తీసుకుంటుందో ఇప్పటి వరకు వచ్చిన ప్రమోషన్స్ చూస్తేనే తెలుస్తోంది. "పెద్ది" ఒక రా అండ్ రియలిస్టిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్నందున, ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. రామ్ చరణ్ ఇటీవల వరుసగా భిన్నమైన పాత్రలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇక "పెద్ది"లో ఆయన మరింత రస్టిక్ లుక్‌లో కనిపించనున్నారని టీమ్ చెబుతోంది. ప్రస్తుతం జరుగుతున్న యాక్షన్ ఎపిసోడ్ పూర్తయ్యాక, వచ్చే షెడ్యూల్స్ కూడా వరుసగా కొనసాగనున్నాయి.మొత్తానికి, ఉన్న క్రేజ్‌కే కాకుండా, జరుగుతున్న షూట్ అప్‌డేట్స్‌తో "పెద్ది"పై ఆసక్తి రోజు రోజుకూ పెరుగుతోంది. చరణ్- బుచ్చి బాబు కలయికలో వచ్చే ఈ సినిమా టాలీవుడ్‌లో మరొక బ్లాక్‌బస్టర్ అవుతుందేమో చూడాలి.

# రంగంలోకి దిగిన కేంద్రప్రభుత్వం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 5 (ప్రభాత జాగృతి) :** ఇండిగో సంక్షోభంపై విచారణకు కేంద్రం ఆదేశించింది. సంక్షోభం నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు వెంటనే కేంద్రం రంగంలోకి దిగింది. నిర్వహణాపరమైన లోపాల కారణంగా దేశీయ విమానయాన సంస్థ ఇండిగో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దాంతో వేలాది మంది ప్రయాణికులు అవస్థలు పడుతుండగా.. ఈ గందరగోళం ఇప్పుడప్పుడే కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం రంగంలోకి దిగింది. శుక్రవారం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. సేవల్లో అంతరాయానికి గల కారణాలను విచారించనుంది. బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు చోటుచేసుకోకుండా ఈ విచారణలో భాగంగా అధికారులు సిఫార్సులు చేయనున్నారు. ఇక ప్రస్తుత పరిస్థితులపై పౌరవిమానయాన శాఖ నిరంతరం సమీక్ష జరుపుతోంది. విమాన కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రయాణికులకు ఎప్పటికప్పుడు అప్‌డేట్లు అందించేలా 24/7 అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. విమానయాన సంస్థలతో సమన్వయం, ప్రస్తుత సమస్యలకు తక్షణ పరిష్కారం చూపే లక్ష్యంతో దీనిని అందుబాటులోకి తెచ్చారు.

కంట్రోల్ రూమ్‌కు కాల్ చేయాల్సిన నంబర్లు 011-24610843, 011-24693963, 096503-91859 అని తెలిపింది. ఈ క్రమంలో ఇండిగో సంక్షోభంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు నిర్ణయించినట్టు తెలిపింది. సంక్షోభానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. గత నాలుగైదు రోజులుగా ఇండిగో విమాన సర్వీసుల సామూహిక రద్దుతో తలెత్తిన సంక్షోభంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ప్రభుత్వం నిర్ణయించినట్టు కేంద్ర విమానయాన శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇండిగో సర్వీసుల్లో ఎక్కడ పొరపాటు జరిగింది, ఇందుకు బాధ్యులెవరనేది దర్యాప్తులో గుర్తించి, అవరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. భవిష్యత్తుల్లో ఇలాంటి అంతరాయాలు తలెత్తకుండా, ప్రయాణికులకు కష్టం కలకుండా చూస్తామని వివరించింది. ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేదని, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, పేషెంట్లు, ఇతరులు అవసరాల కోసం ప్రయాణాలు సాగిస్తుంటారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సి ఉంటుందని పేర్కొంది.సర్వీసులు శనివారం నుంచి తిరిగి ప్రారంభమవుతాయని అంచనా వేస్తున్నామని, మూడు రోజుల్లోగా పూర్తిగా పునరుద్ధిస్తామని తెలిపింది.కాగా, నలుగురు సభ్యులతో కూడిన దర్యాప్తు కమిటీని కేంద్రం పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా ఇండిగో ఫ్లైట్స్‌కు కలిగిన తీవ్ర అంతరాయం, ఇందుకు దారితీసిన పరిస్థితులపై కమిటీ దర్యాప్తు చేసి నివేదికను 15 రోజుల్లోగా సమర్పించనుంది.



# వేసవిలో శ్రీలీల ప్రేమ కబుర్లు

తన స్టెప్పులతో యువతను విశేషంగా ఆకట్టుకునే శ్రీలీల.. బాలీవుడ్ హీరో కార్తిక్ ఆర్యన్‌తో కలిసి ఓ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ రొమాంటిక్ డ్రామాకు అనురాగ్ బసు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే తెరపైకి రావాల్సిన ఈ సినిమా కొన్ని కారణాల వల్ల విడుదల వాయిదా పడింది. ఇప్పుడు దీన్ని వచ్చే ఏడాది వేసవి సందర్భంగా మే 1న థియేటర్లలోకి తీసుకొచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. భావోద్వేగాలు, సంగీతమే ప్రధాన ఆకర్షణగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో ఓ ప్రముఖ సంగీత దర్శకుడు అతిథి పాత్రలో మెరవనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుకు 'తూ మేరి జిందగీ హై' అనే పరిశీలనలో ఉంది. మరి దక్షిణాదిలో కుర్రకారుని ఉర్రూతలూగిస్తోన్న శ్రీలీల.. కార్తిక్‌తో కలిసి బాలీవుడ్ ప్రేక్షకులకు ఎలాంటి ప్రేమకబుర్లు చెప్తుందో చూడాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



# వి.శాంతారామ్ బయోపిక్‌లో తమన్నా ?

దక్షిణాదితో పాటు.. ఇటు ఉత్తరాదిలోనూ వరుస అవకాశాలను అందుకుంటూ జోరుమీదుంది అందాల తార తమన్నా. ఆకట్టుకునే నటన, కుర్రకారుని ఉర్రూతలూగించే ప్రత్యేక పాటలతో బిజీగా ఉన్న ఈ భామ ఖాతాలోకి ఇప్పుడు మరో ప్రాజెక్టు చేరినట్లు తెలుస్తోంది. బాలీవుడ్ యువ కథానాయకుడు సిద్ధాంత్ చతుర్వేది.. ప్రముఖ దర్శకుడు, నటుడు వి. శాంతారామ్ బయోపిక్‌లో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. అభిజీత్ దేశ్‌పాండే దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పడిందులో కథానాయికగా తమన్నాని ఎంపిక చేశారట. ఈ మధ్య కాలంలో ఆమె పోషించిన పాత్రల్ని దృష్టిలో పెట్టుకొని.. ఈ బయోపిక్‌లో తమన్నా అయితేనే సరిగ్గా సరిపోతుందని చిత్రబృందం ఈ నిర్ణయం తీసుకున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాల్ని త్వరలో అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం.

# మళ్లీ మన ప్రభుత్వమే వస్తుంది

- పల్లెలకు మంచి రోజులొస్తాయ్: కేసీఆర్ ధీమా!
- ఏకగ్రీవ సర్పంచులతో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో భేటీ
- కష్టకాలం తాత్కాలికమే... అధైర్యపడొద్దు
- స్వయంశక్తితో పల్లెలను అభివృద్ధి చేసుకోండి
- గంగదేవిపల్లి ఆదర్శంగా తీసుకోండి
- ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలు సమృద్ధి సాధిస్తాయ్
- మన పని మనమే చేసుకుంటూ ముందుకు సాగాలి



గజ్వేల్, డిసెంబర్ 5 (ఈనాడు): "మళ్లీ మన ప్రభుత్వమే వస్తుంది... తెలంగాణ పల్లెలకు తిరిగి మంచి రోజులు తప్పకుండా వస్తాయ్" అంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైన ఎర్రవల్లి, నర్సన్నపేట సర్పంచులు, గ్రామస్థులతో ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఏకగ్రీవాల జోష్ కనిపిస్తోందని, అది ప్రజల్లో బీఆర్ఎస్ పట్ల ఉన్న అభిమానం, నమ్మకాన్ని తెలుస్తోందని కేసీఆర్ గుర్తుచేశారు. "అన్ని కాలాలూ అనుకూలంగా ఉండవు. కొన్ని సమయాల్లో కష్టాలు వస్తాయి. వాటికి వెరవకూడదు. ఇప్పుడు కష్టకాలం తాత్కాలికమే. త్వరలోనే మన ప్రభుత్వం మళ్లీ వచ్చి పల్లెలను బంగారు బాట పట్టిస్తుంది" అని ఆయన ధీమా నింపారు.ఇప్పటిదాకా ప్రభుత్వం ఇస్తుందని ఎదురుచూడకుండా, స్వయంశక్తితో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని కేసీఆర్ సూచించారు. గంగదేవిపల్లి లాంటి గ్రామాలను ఆదర్శంగా తీసుకుని, ప్రజల భాగస్వామ్యంతో కమిటీలు ఏర్పాటు చేసుకుని, మన పని మనమే చేసుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. "ఎవరో ఏదో ఇస్తారని ఆగొట్టుకోకూడదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన స్ఫూర్తితోనే పల్లెలను, సామాజిక, ఆర్థిక స్వయం సమృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దుకోవాలి" అని కేసీఆర్ కోరారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు గొప్ప ఆలోచనలతో, సుదూర దృష్టితో గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని, ప్రజలందరి సహకారంతో గ్రామాలను మాదిరిగా తీర్చిదిద్దాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.